

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా శనివారం ఆర్కే బీచ్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పార్టీ నేతలు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, నేతలు చోడే వెంకట పట్టాభి, పోతన్నరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఘనంగా లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవం



ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో శనివారం సాయంత్రం నిర్వహించిన లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డికి ఎన్టీఆర్ చిత్రంతో కూడిన వంద రూపాయల నాణెం అందజేస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బ్రహ్మానందం. చిత్రంలో గంటా శ్రీనివాసరావు, దర్శకుడు వైవీఎస్ చౌదరి ఉన్నారు. లోక్‌నాయక్ సాహిత్య పురస్కారాలను కవి అందెశ్రీ, సాహితీవేత్త ఖాదర్ మొహియుద్దీన్‌లకు అందజేశారు. -వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...

భీమిలి వైసీపీ సమన్వయకర్తగా చిన్న శ్రీను

- చోడవరానికి గుడివాడ అమర్‌నాథ్
- గాజువాకకు తిప్పల దేవన్‌రెడ్డి
- అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా ధర్మశ్రీ

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి కొత్త సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అనకాపల్లి పార్లమెంటు

... మిగతా 6వ పేజీలో

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

బీటలు వారుతున్న బంధాలకు రాజీ మంత్రం

- విడిపోవడానికి సిద్ధమైన దంపతులను చర్చల ద్వారా మళ్లీ కలుపుతున్న డొమెస్టిక్ వయోలెన్స్ సెల్ అధికారులు
- కట్నం వేధింపులు, అనుమానాలు, అపోహలతో వచ్చేవారే ఎక్కువ
- కలిసి ఉండేందుకు ఇష్టపడని ఎంతోమంది..
- మాటల ద్వారా మార్పు తెస్తున్న సెల్
- గడిచిన ఏడాది 474 జంటల మధ్య రాజీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పరిధిలోని గాజువాక ప్రాంతానికి చెందిన యువతికి అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడితో ఏడాది కిందట వివాహం అయింది. యువతి ఉద్యోగం చేస్తుండడంతో నగరంలో నివాసం ఉందామని ముందుగానే చెప్పింది. వివాహమైన తరువాత తమ తల్లిదండ్రుల వద్దే ఉండాలని భర్త వేధిస్తుండంతో ఆమె గృహ హింసకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించే సెల్ (డొమెస్టిక్ వయొలెన్స్‌ను ఆశ్రయించింది. ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో విడిపోయేందుకు సిద్ద మయ్యారు. ఇరువురికీ సెంటర్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా ఇరువైపుల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడి...సిటీలో నివాసం ఉండేలా, సెలవు రోజుల్లో భార్య,భర్తలు ఇద్దరూ వెళ్లి తల్లిదండ్రు లను చూసుకునేలా ఒప్పించడంతో సమస్య పరిష్కారమైంది.



మధురవాడ ప్రాంతానికి చెందిన మహిళకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త వేధిస్తుండడంతో ఆమె డొమె స్టిక్ వయెలెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె భర్తను పిలి పించి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తరహా వేధింపులు వల్ల జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించడంతోపాటు న్యాయపరంగా ఉన్న చిక్కులను వివరించారు. అదే సమ యంలో ఇద్దరి మధ్య ఉన్న కొన్నిరకాల అపోహలు, అంతరా లను తొలగించి, కలిసి ఉండేలా చేశారు. ప్రస్తుతం ఇద్దరూ ఆనందంగా గతంలో మాదిరిగా జీవనాన్ని సాగిస్తున్నారు.

...చిన్న చిన్న కారణాలతో విడిపోయేందుకు ఈ మధ్య కాలంలో ఎందరో దంపతులు సిద్ధమవు తున్నారు. కొన్ని కేసుల్లో భర్త తప్పు ఉంటే... మరికొన్ని కేసుల్లో భార్య తప్పు ఉంటోంది. ఇద్దరూ కూర్చుని పది నిమిషాలు మనసు విప్పి మాట్లాడుకుంటే సమసిపోయే దానికి.... ఇగోలకు పోతున్నారు. ఇటు వంటి ఎన్నో సమస్యలకు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కార మార్గాలను చూపించి ఏకం చేస్తున్నారు ఎంవీపీ కాలనీలోని డొమెస్టిక్ వయొలెన్స్ సెల్ అధికారులు. కట్నం, లైంగిక వేధింపులు, అనుమానాలు, అపోహలు వంటి కారణాలు/ గొడవలతో విడిపోయేందుకు సిద్ధమై వస్తున్న జంటల మనసులను మార్చి వైవాహిక జీవితాన్ని కొనసాగించేలా కృషిచేస్తున్నారు.

గతంతో పోలిస్తే పెరుగుదల..

భార్యభర్తల మధ్య గొడవలకు

... మిగతా 6వ పేజీలో

జడ్పీ బడ్జెట్ రూ.1,586.08 కోట్లు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదాయం రూ.1589.13 కోట్లు
- వ్యయం రూ.1586.08 కోట్లు
- మిగులు రూ.3,05,23,400
- ఆమోదం తెలిపిన సర్వసభ సమావేశం



జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి రూ.1,586.08 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. అలాగే 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ (రూ.1,360.75 కోట్లు)కు కూడా ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుత సంవత్సరానికి గతంలో రూపొందించిన బడ్జెట్‌కు సవరణ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి తయారు చేసిన అంచనా బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలపడం ఆనవాయితీ. దీని ప్రకారం 2024-25 సంవత్సరానికిగాను సవరించిన బడ్జెట్‌లో రూ.1360.75 కోట్లు ఆదాయంగా, రూ.1352.85కోట్లు వ్యయంగా చూపించారు. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1589.13 కోట్లు ఆదాయంగా, రూ.1586.08 కోట్లు వ్యయంగా అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. అంచనా బడ్జెట్‌లో వ్యయం కంటే ఆదాయం రూ.3.05 కోట్లు అధికంగా ఉండడంతో దానిని మిగులుగా చూపించారు. ఆదాయపరంగా చూస్తే జిల్లా పరిషత్‌కు వచ్చే సాధారణ నిధులు, కేంద్రం మంజూరుచేసే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.48.83 కోట్లు, ఇతర శాఖలు అంటే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పశు సంవర్ధక, మత్స్యశాఖల నుంచి రూ.1322.76 కోట్లు పొందుపరిచారు. సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.46.78 కోట్లు ఇతర శాఖలకు సంబంధించి రూ.1539.30 కోట్లు వ్యయంగా చూపించారు. బడ్జెట్‌పై సభ్యులు చర్చించి అనంతరం ఆమోదం తెలిపారు. త్వరలో ప్రభుత్వ ఆమోదానికి పంపుతామని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి వెల్లడించారు.

అనుమతుల్లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

వైసీపీ హయాంలో ఉన్నతాధికారుల ఒత్తిడితో పనులు

ఆ పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు గగ్గోలు

- అనర్హులు బోలెడు మంది...
- ప్లాట్ల కేటాయింపులో జీవీఎంసీ, హౌసింగ్ మధ్య సమన్వయ లోపమే కారణం

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో అనేక ఉల్లంఘనలు జరిగాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా విశాఖ జిల్లాలో 1.3 లక్షల ఇళ్ల నిర్మాణానికి నగర శివార్లలో ఏకంగా 73 లేఅవుట్లు అభివృద్ధి చేసిన అధికారులు...వేగంగా పనులు పూర్తి చేయాలనే నెపంతో కొన్నిచోట్ల అనుమతులు లేకపోయినా పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. తీరా బిల్లులు దగ్గరకు వచ్చేసరికి కప్పదాటుగా వ్యవహరిస్తున్నారు.

పెందుర్తి మండలం ముదపాక, సబ్బవరం మండలం గొల్లల పాలెం, నంగినారపాడు, ఆనందపురం మండలంలో కొన్ని లేఅవుట్‌లలో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన విషయం ఇప్పుడున్న అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం కోసం నగరం చుట్టుపక్కల మండలాల్లో సుమారు ఐదున్నర వేల ఎకరాలు సమీకరించి, 1.3 లక్షల మందికి సెంటు వంతున కేటాయించింది. ప్రతి ఇంటికీ పీఎంఏవై కింద కేంద్రం 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు..వెరసి రూ. 1.8 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారు. అయితే లేఅవుట్‌లు నగరానికి చాలా దూరంగా ఉండడంతో లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణానికి ముందుకురాకపోవడంతో అనధికారికంగా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. ఎంత అనధికారికమైనా...పనులు అప్పగించేటప్పుడు హౌసింగ్ అధికారులు డీపీఆర్ ఆమోదించి దాని ప్రొసీడింగ్స్ సదరు కాంట్రాక్టర్‌కు అందజేయాలి. అయితే ముదపాక, గొల్లలపాలెం, నంగినారపాడు, మరి కొన్నిచోట్ల ప్రొసీడింగ్స్ ఇవ్వకుండానే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపజేశారు. డీపీఆర్ ఆమోదించి ప్రొసీడింగ్స్ జారీచేసిన ఇళ్లకు మాత్రమే జియో ట్యాగింగ్ చేసి, చేసిన పనుల మేరకు ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేస్తారు. డీపీఆర్ ఆమోదం లేకుండా నిర్మించిన ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయరు. దీంతో బిల్లులు అప్‌లోడ్ కావు. ఈ విషయం గత ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారులు, కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో క్షేత్రస్థాయి అధికారులు చెప్పినా పట్టించుకోలేదు. కట్టిన ప్రతి ఇంటికీ సొమ్ములు ఇస్తామని, ఎటువంటి భయం

... మిగతా 6వ పేజీలో



పెందుర్తి మండలం ముదపాకలో పునాదుల్లో నిలిచిన నిర్మాణాలు



కలెక్టరేట్‌లో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్. చిత్రంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు ఉన్నారు

కలెక్టరేట్‌లో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ

- స్వచ్ఛ విశాఖగా జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం ద్వారా జిల్లాను స్వచ్ఛ విశాఖగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో ఆయన స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. తరువాత పలు విభాగాల్లో పర్యటించి పరిశుభ్రత పట్ల ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్,ఏవో ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ విలువల సవరణ

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీస్ బోర్డులో 'కొత్త ప్రతిపాదనలు'
- 24వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకారం
- ఒకటో తేదీ నుంచి అమలు

- వార్త 6వ పేజీలో

సొంత గనులు కూడా సాధిస్తాం



ఎన్డీయే ప్రభుత్వానికి థ్యాంక్స్ చెబుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ. పక్కన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయకుమార్ తదితరులు

- జనసేన ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల,వంశీకృష, సుందరపు
- ప్యాకేజీ సాధనలో పవన్ కల్యాణ్‌ది కీలక పాత్ర
- జనసేన పార్టీ కార్యాలయంలో సంబరాలు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్రభుత్వం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం వెనుక జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చాలా ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెల్లడించారు. ఇదే పట్టుదలతో స్టీల్‌ప్లాంటుకు సొంత ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కేంద్రం సాయం ప్రకటించిన నేపథ్యంలో శనివారం సీతంపేటలోని

... మిగతా 6వ పేజీలో

ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు నూతనశక్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్. చిత్రంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, గండి బాబ్జీ, సుధాకర్ ఉన్నారు.

- ఉక్కు సత్తా ఏమిటో దేశానికి చూపాల్సిన సమయం వచ్చింది
- సంస్థాగతంగా సమూల మార్పులు తీసుకువచ్చేలా కృషిచేస్తా
- కీలక పోస్టుల్లో సమర్థులను నియమించాల్సిన అవసరం ఉంది
- ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు
- ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు కర్మాగారం సత్తా ఏంటో దేశానికి చూపించాల్సిన సమయం వచ్చిందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన రూ. 11,440 కోట్లు ప్యాకేజీని సద్వినియోగం చేసుకునేందుకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మూడేళ్ల తరువాత

... మిగతా 6వ పేజీలో


మధురవాడ : ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న 7వ వార్డు కార్పొరేటర్ మంగమ్మ, టీడీపీ నేతలు


సాగర్‌నగర్ : ఎన్టీ రామారావుకు నివాళి అర్పిస్తున్న 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ నాయకులు


కొమ్మాది : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న 5వ వార్డు కార్పొరేటర్ హేమలత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

జననేతకు ఘన నివాళి

మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా భీమిలి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నేతలు, అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో వక్తలు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు.

మధురవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు తదితరులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగోతి సూర్యప్రకాశరావు, కానూరి అచ్యుతరావు, పోతిన నాయుడు, పోతిన బాలాజీ, నాగోతి శివాజీ, సింహాచలం, కలివేల్పు సూరిబాబు, పిళ్లా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో..

విశాలాక్షినగర్ : కైలాసగిరి కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ 9వ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, జనసేన ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ జె.నాగలక్ష్మి, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సబ్బి శివ, వెంకన్న, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. జోడుగుళ్లపాలెం కూడలిలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చిన్నారావు, బాదరు బాలరాజు, బుడుమూరి భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో..

సాగర్‌నగర్ : స్థానికంగా గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసారు.టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, అక్కరబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : పద్మనాభంలోని ఎన్టీఆర్ పార్కులో ఎన్టీ రామారావు విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ లీలావతి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచ్ పావని, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్‌లో..

పద్మనాభం రూరల్ : మండలంలోని పాండ్రంగి, అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ స్థానిక నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎం.సోమేశ్వరరావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు. అప్పలసూర్యనారాయణ, తాతాజీ ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం : జీవీఎంసీ 3, 4 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎన్టీఆర్‌కు పలువురు నివాళులు అర్పించారు. చిన్నబజారులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, బీచ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నేతలు సీహెచ్ రమణ, కె.నాగరాజు, పాసి నర్సింగరావు పాల్గొన్నారు. కె.నగరపాలెంలో జరిగిన కార్యక్రమంలో పి.సాంబ, పి.త్రినాథకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం : వేములవలస పూలమార్కెట్, ఎల్వీ పాలెంలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గండ్రెడ్డి స్వామినాయుడు, బమ్మిడి ఉమ, మీసాల సత్యన్నారాయణ, బీఆర్బీ నాయుడు, తాత్రాజు అప్పారావు, కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, అంగటి రాము, చెన్నా నర్సింగరావు, చందవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో..

కొమ్మాది : గ్రేటర్ విశాఖ 5వ వార్డులోని పరదేశిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ మొల్లి హేమలత పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు వాండ్రాసి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. పీఎం పాలెం కార్‌షెడ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ 6వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ సీనియర్ నేతలు జి.సన్యాసిరావు, జి.ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : మహా విశాఖ 98వ వార్డు సింహాచలం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ నరసింహంతో పాటు పలువురు అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 98వ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నేతలు రౌతు రాంబాబు, గుసిడి అవినాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో ఘనంగా సైనిక దినోత్సవం

వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్రాంత మాజీ సైనిక దళాలు

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగరతీరంలో మొట్టమొదటిసారి శనివారం సైనిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ ఆర్మ్‌డ్ డే వేడుకల్లో ఇండియన్ నేవీ తో పాటు ఆర్మ్‌డ ఫోర్స్‌లో వివిధ విభాగాలకు చెం దిన విశ్రాంత సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెందల్కర్, రిటైర్డ్ వైస్ అడ్మిరల్ వీకే నంబ్లా, డాక్టర్ వి.చంద్రశేఖర్‌లు జెండా ఊపి వేడుకలు ప్రారంభించారు. విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు విశ్రాంత సైనిక ఉద్యోగులు కవాతు (పరేడ్) నిర్వహించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పరస్పరం పలకరించుకుంటూ ఆత్మీయ ఆలింగనాలు, కరచాలనాలు చేసుకున్నారు. ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు. దేశభక్తిని ప్రతిబింబించే నేవల్ బ్యాండ్‌ను తిలకించారు. అల్పాహార విందు ఆరగిస్తూ తమ విధి నిర్వహణలో ఎదుర్కొన్న కష్టసుఖాలు, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, సుమారు 500 మంది మాజీ సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్కే బీచ్‌లో నిర్వహిస్తున్న కవాతులో నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ పెందల్కర్ తదితరులు

సంప్రదాయబద్ధంగా అప్పన్నకు నిత్యకల్యాణం


కల్యాణ అక్షతలు చూపుతున్న అర్చకస్వాములు

సింహాచలం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామికి సంప్రదాయబద్ధంగా ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు. దానిలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ఆగమశాస్త్రోక్తంగా కంకణధారణ, నూతన యజ్ఞోపవీత ధారణ చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ చేసి అక్షితారోపణం గావించారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

డీ అడిక్షన్ సెంటర్ నుంచి రోగుల పరారీ

ఎండాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని మిథిలాపురి వుడాకాలనీలో గత ఆల్కాహాల్ డీ అడిక్షన్ సెంటర్ నుంచి రోగులు పరారయ్యాని పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వుడా కాలనీలో నిర్వహిస్తున్న సెంటర్‌లో వార్డు బాయ్‌గా పని చేస్తున్న బి.శ్రీనివాస్‌దురుసుగా ప్రవర్తించడంతో అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న రోగులు నలుగురు పారిపోగా, అందులో ఇద్దరు ఇళ్లకి చేరుకున్నారని, మరో ఇద్దరు ఆచూకీ లభ్యం కాలేదని ఫౌండేషన్ చైర్‌పర్సన్‌ఉమారాజ్ పీఎం పాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోమని ఫిర్యాదులో పేర్కొన్నారు

ఉపాధి హామీలో పశుగ్రాసం సాగు

పద్మనాభం రూరల్, జనవరి (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం సాగుకు అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మహేష్‌కుమార్ సూచించారు. 10 నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో సాగుచేసుకోచ్చునని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న రైతు కనిష్ఠంగా 10 సెంట్లలో సాగు చేస్తే కూలీల వేతనంగా రూ.3 వేలు, ఉపకరణాల ఖర్చుగా రూ.3,599 ఇస్తామన్నారు. గరిష్ఠంగా 50 సెంట్లు సాగు చేసినవారికి కూలీ ఖర్చు రూ.15 వేలు, ఉపకరణాలకు రూ.17,992 పొందవచ్చన్నారు. సాగు గడువు ఏడాది అన్నారు. చాలా మందికి ఈ విషయం తెలియక వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

» జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి హితవు » పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు » అధికార, అనధికారుల ప్రతిజ్ఞ


బాందేవుపురంలో పరిశుభ్రత కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి తదితరులు


ఆనందపురం మండలం గొట్టిపల్లి (పైన), భీమిలి మండలం తాళ్లవలసలో ప్రతిజ్ఞ


సింగనబంద గ్రామంలో చైతన్య ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పద్మనాభం/పద్మనాభం రూరల్/భీమునిపట్నం/భీమునిపట్నంరూరల్/ఆనందపురం/మధురవాడ/ఎండాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ శ్రీనివాస్, ఇతర అధికారులు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పద్మనాభం మండలం బాందేవుపురం, ఆనందపురం మండలంలో శనివారం వారు పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీఈవో పిలుపునిచ్చారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేసిన అనంతరం పద్మనాభం జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ విజయకుమార్, ఈఓఆర్డీ మీనా కుమారి, టీడీపీ నాయకులు రమణ, దాము, లీలావతి, నగేష్ కుమార్, ఏపీఎం సాయిరమేష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. భీమిలిలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాల్లో స్వచ్ఛ దివస్ ఘనంగా నిర్వహించారు. బీచ్‌రోడ్‌లోని మునిసిపల్ పొట్టి శ్రీరాములు పార్క్‌లో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నలత, అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు. పార్కును శుభ్రపరిచిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్, ఏవో శివకోమలి తమ కార్యాలయంలో వ్యర్థాలు తొలగించి మొక్క నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ఎ.బి. మల్లిఖార్జునరావు, శోభారాణిల ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. సింగనబందలో సర్పంచులు, ఎంపీటీసీలు చైతన్య ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ సర్పంచి జి. వి.నారాయణ, ఎంపీటీసీ తుపాకుల పైడిరాజు, గుడ్డాల ఎల్లయ్యల ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి, కుసులువాడ పంచాయితీల్లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. పంచాయితీ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేసిన అనంతరం వ్యర్థాలు తొలగించారు. కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రపరిచారు. ఎంపీడీవో జానకి, పంచాయితీ విస్తరణాధికారి బి.సత్యనారాయణ పాల్గొన్నారు. మధురవాడ పీహెచ్‌సీ ఆవరణను సిబ్బందితో కలసి పీహెచ్‌సీ డాక్టర్ ప్రశాంతి శుభ్రం చేశారు. ఎండాడ చెరువు ప్రాంతాన్ని జీవీఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. 9వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ స్వాతిదాస్, టీడీపీ నాయకులు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మధురవాడలో చెత్తను ఊడుస్తున్న వైద్యాధికారిణి, సిబ్బంది


పద్మనాభంలో మానవహారం

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

భీమునిపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. భీమిలి, చిట్టివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 545 మందిలో 414 మంది పరీక్షకు హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారిణి మానేపల్లి శివరాణి తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో శివరాజీ పర్యవేక్షించారు. భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డెప్యూటీ డీఈవో సోమేశ్వరరావు సందర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 192 మందికి 145 మంది హాజరైనట్లు పరిశీలకులు తిరుమల శ్రీదేవి, సెంటర్ సూపరింటెండెంట్ సతీష్ తెలిపారు. ప్రతీ కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

భూ విలువల సవరణ

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూముల విలువలు సవరించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్లు అంతా కొత్త ప్రతిపాదనలు జిల్లా కమిటీకి సమర్పించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వాన ఏర్పాటైన కమిటీ వాటిని పరిశీలించి ఆమోదం తెలిపింది. వాటిని శనివారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ శనివారం తెలిపారు. వాటిపై అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ సబ్ రిజిస్ట్రార్, మండల తహసీల్దార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో తెలపవచ్చునన్నారు. వాటిని పరిశీలించి కమిటీ ముందు పెడతామన్నారు. చివరిగా ఖరారు చేసిన విలువలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. గతంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావించిందని, దానిని ఫిబ్రవరికి వాయిదా వేయడం వల్ల మళ్లీ ప్రతిపాదనలు, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు.

కాళీయమర్దనుడిగా అప్పన్న

సింహాచలం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వార్షిక రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఒకచేతితో కాళీయుడి తోకను పట్టుకుని, కాళ్లతో కాళీయుడి పడగలపై నర్తిస్తున్న భంగిమలో భక్తులకు సింహాద్రినాథుడు కాళీయమర్ధనుడిగా దర్శనమిచ్చాడు.



భీమిలి వైసీపీ సమన్వయకర్తగా చిన్న శ్రీను

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గ పరిశీలకునిగా కరణం ధర్మశ్రీని, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడును, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించింది.

అనుమతుల్లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

అక్కర్లేదన్నారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల తరువాత లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మరోసారి బిల్లుల సంగతి ప్రస్తుత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముదపాక, గొల్లలపాలెంలో ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల అభ్యర్థన మేరకు డీపీఆర్ ఆమోదించాలని ఉన్నతాధికారులకు ఏఈలు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 73 లేఅవుట్‌లలో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లు ఎన్ని?, ఏ మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉందనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

ఇదిలావుండగా సుమారు పది వేల మంది వరకూ లబ్ధిదారులు తమకు కేటాయించిన చోట కాకుండా మరోచోట ప్లాట్లు కేటాయించాలని కోరుతున్నారు. మరోవైపు ప్లాట్లు మంజూరు చేసిన తరువాత జీవీఎంసీ అధికారులు విచారణ చేపట్టగా వందల మంది అనర్హులుగా తేలారు. అప్పటికే అక్కడ ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు ప్రారంభించేశారు. అటువంటి ఇళ్లకు బిల్లులు ఇవ్వరు. ఈ విషయంలో హౌసింగ్ సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు మధ్య సమన్వయం లేదనే వాదన ఉంది. జిల్లాలోని లేఅవుట్‌లలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇళ్లు ఎన్ని?, లబ్ధిదారులకు ఇష్టం లేకుండా నిర్మించినవి ఎన్ని?...అనేవి తేలాల్సి ఉంది. ఒకేసారి లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే ఆదుర్దాతో గత పాలకులు తగిన కసరత్తు చేయకపోవడమే ప్రస్తుత గందరగోళానికి కారణమని హౌసింగ్ సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు.

సొంత గనులు కూడా సాధిస్తాం

... 5వ పేజీ తరువాయి

పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా గుర్తింపు పొందిన విశాఖ ఉక్కును కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ఈ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారన్నారు. ప్లాంటుకు అవసరమైన ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్లాంటుకు సొంత గనులు కూడా సాధించి విశాఖ ఉక్కును దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపేలా చేస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంటు సమస్యపై అనేకసార్లు ప్రధాని మోదీతో పవన్ కళ్యాణ్ మాట్లాడారని, కూటమి నేతల కృషి వల్లనే అన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంఎస్ఎంఈల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, పార్టీ నాయకులు కోన తాతారావు తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చివరిగా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు నూతనశక్తి

... 5వ పేజీ తరువాయి

మరోసారి సహకారం కోసం వేచి చూసే పరిస్థితి రాకూడదన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్యాకేజీకి పదింతలు భవిష్యత్తులో తిరిగి దేశానికి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్యాకేజీ ద్వారా ప్లాంటు కార్యకలాపాలకు నూతనశక్తి వస్తుందన్నారు. గతంలో వాజపేయి హయాంలో అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, దివంగత ఎర్రన్నాయుడు, విశాఖ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి కలిసి ప్లాంటును కాపాడారని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు, భారత ప్రధాని నరేంద్రమోదీ, నిర్మలాసీతారామన్, కుమార్‌స్వామితో చర్చించడంతో రివైవల్ ప్యాకేజీ ప్రకటించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో సంస్థాగతంగా సమూల మార్పులు తీసుకువచ్చేలా, ఆ దిశగా ఉక్కు మంత్రిత్వశాఖ ముందడుగు వేసేలా స్థానిక ఎంపీగా బాధ్యత తీసుకుంటానని శ్రీభరత్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉక్కు కర్మాగారం రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి అభ్యర్థిగా తాను ఇచ్చిన ఏడు హామీల్లో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూస్తానన్నది ఒకటని శ్రీభరత్ పేర్కొన్నారు. దానికి కట్టుబడి లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేసిన వెంటనే కేంద్ర ఉక్కుమంత్రి కుమార్‌స్వామి వద్దకు వెళ్లి కర్మాగారం గురించి వివరించానన్నారు. ఇంకా పలు సందర్భాలలో కేంద్ర మంత్రులను కలిసినపుడు ఇక్కడ పరిస్థితి వివరించి కర్మాగార కార్మికులకు భరోసా కల్పిస్తూ వచ్చానన్నారు. కర్మాగారంలో కీలక పోస్టుల్లో సమర్థులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర క్యాబినెట్‌ను ఒప్పించి ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి శ్రీభరత్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

... 5వ పేజీ తరువాయి

అనేక అంశాలు కారణమవుతున్నాయి. కట్నం, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ వేధింపులకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. అలాగే అనుమానాలు, అపోహలు, మనస్పర్థలు, సెల్‌ఫోన్ తెచ్చిన చిక్కులతో కూడిన కేసులు కూడా ఉంటున్నాయి. చాలామంది తాము విడి పోతామని, కలిసి ఉండలేని పరిస్థితికి చేరామంటూ అధికారులు వద్దకు వస్తున్నారు. వీరి సమస్యను సావధానంగా వింటున్న అధికారులు ఇరు వర్గాలను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ నిర్వహించి కలిసి ఉండేలా చేస్తున్నారు. గతంతో పోలిస్తే కౌన్సెలింగ్‌తో కలిసి ఉండేందుకు సిద్ధమవుతున్న జంటల సంఖ్య పెరిగిందని చెబుతున్నారు.

గడిచిన ఏడాది కాలంలో మొత్తం 3,716 కేసులు నమోదు కాగా, వీటిలో ఇప్పటివరకూ 474 కేసులను కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పరిష్కరించారు. మరికొన్ని కేసులు కౌన్సెలింగ్ దశలో ఉన్నాయి. కొన్ని కోర్టు వరకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. 1,104 కేసులు కోర్టుల్లో క్లియర్ అయ్యాయని, బాధితులకు నష్ట పరిహారాన్ని అందించేలా చేశామని అధికారులు వెల్లడించారు.

దఫదఫాలుగా చర్చలు

ఈ సెల్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితురాలితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, భర్తతో అధికారులు దఫదఫాలుగా చర్చలు జరుపుతారు. భార్యభర్తతోపాటు వారి కుటుంబ సభ్యులు, అవసరమైతే కొన్నిసార్లు ఆ ప్రాంతానికి చెందిన పెద్ద మనుషులను రప్పించి మాట్లాడ తారు. సమస్య ఎవరి వైపు ఉందో తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. భార్యను వేధించడం తగదని, సర్దుబాటు చేసుకుని దాంపత్య జీవితం కొనసాగించాలని భర్తకు సూచిస్తారు. కాదు, కూడ దంటే చట్టపరంగా ఉన్న ఇబ్బందులను తెలియ జేస్తారు. మరోవైపు అమ్మాయిలో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వ హిస్తారు. విడిపోతే ఎదురయ్యే ఇబ్బందులు, సమాజం ఎలా చూస్తుందన్న విషయాలను తెలియజేస్తారు. ఇరువురితో వేర్వేరుగా మాట్లాడి అన్ని అంశాలను కూలం కుశంగా వివరించి రాజీకి వచ్చేలా అధికారులు కృషిచేస్తున్నారు.

ఐదేళ్లలోపు జంటలే ఎక్కువ..

పెళ్లై ఐదేళ్లు కూడా కాని జంటలే ఎక్కువగా సెల్‌కు వస్తున్నాయి. తక్కువ వయసు కావడం, ఇగోలకు పోవడంతో సమస్య తీవ్రతరం అవుతోందని అధికారులు చెబుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఎంతో మంది వైవాహిక జీవితాలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని డీవీ సెల్ అధికారి జ్యోతి వెల్లడించారు. గతంతో పోలిస్తే రాజీకి అంగీకరిస్తున్న వారి సంఖ్య గడిచిన ఏడాది కొంత మెరుగ్గా ఉందన్నారు. ఇద్దరూ ఉద్యోగులైన జంటల్లో ఈ సమస్య కొంత అధికంగా ఉందని పేర్కొన్నారు.


వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, మళ్ల రవికుమార్ తదితరులు


మద్దిలపాలెం : వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గుడ్ల విజయసాయి


ఎంవీపీ కాలనీ : ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ మంగమణి, పలువురు టీడీపీ నేతలు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

- టీడీపీ నేతల ఆధ్వర్యంలో వాడవాడలా సంక్షేమ కార్యక్రమాలు
- సినీ, రాజకీయ రంగాల్లో అందించిన సేవలను కొనియాడిన వక్తలు

మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. తూర్పు నియోజకవర్గంలోని వివిధ చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, అభిమానులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో వక్తలు మాట్లాడుతూ సినీ రంగానికి ఆయన అందించిన సేవలు, రాజకీయ రంగంలో ఆయన చేపట్టిన సంక్షేమ, సంస్కరణలను కొనియాడారు.

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట, కేఆర్‌ఎం కాలనీ, రజకవీధి ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహానికి వార్డు అధ్యక్షులు నారు గోపి, నాయకులు ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, మొల్లి శోభ జి.అప్పన్న, బంగారాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే 15వ వార్డులోని హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, ద్రాక్షవరపు వరలక్ష్మి, సీహెచ్ గోవింద్, సూరిబాబు, నరేంద్ర, కె.మహేష్, కర్రి గౌరీ, నూకరాజు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : గ్రేటర్ విశాఖ 23వ వార్డులో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి ఆధ్వర్యంలో ప్రియదర్శినికాలనీలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి దంపతులు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గొలగాని పురుషోత్తం, అచ్చి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే 22వ వార్డులోని మంగాపురంకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్విస్వామి, ఒమ్మి అప్పారావు, ఆనంద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డులోని అప్పుఘర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పోలారావు, నాయకులు నూకరాజు, రవి, హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 17వ వార్డులోని ఆదర్శనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ వార్డు నేతలు కాళ్ళ శంకర్, జిల్లా కార్యదర్శి సత్తిబాబు, రాములమ్మ, వర, గోపమ్మ, నరేంద్ర, రాజు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : గ్రేటర్ విశాఖ 13వ వార్డులోని దుర్గా బజార్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ కార్యదర్శి యల్లమల్లి సురేష్, వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు 200 మందికి దుస్తులు, పండ్లు, బియ్యం అందించారు. జనసేన నేతలు నీలి పైడి రాజు, సన్ని తదిదతరలు పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులోని గాంధీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పూలమాలలు వేసి నివాలలు అర్పించారు. భైరెడ్డి పోతనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంస్కర్త ఎన్టీఆర్ : భీమిలి ఎమ్మెల్యే గంటా


మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సంక్షేమ పథకాలను పరిచయం చేసిన సంస్కర్త అన్న ఎన్టీఆర్ అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆర్కే బీచ్ దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు' నినాదంతో రాజకీయ పార్టీ పెట్టిన 9 నెలల్లోనే 100 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో సహా పెకిలించిన ఘన ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు ప్రసరింపజేసిన ఎన్టీఆర్ కారణజన్ముడని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు కోటి పార్టీ సభ్యత్వాలతో ప్రభంజనం సృషించారన్నారు. పార్టీకి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తల కోసం ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తే మనుగడకు మేలు

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో మేయర్ హరి వెంకటకుమారి


శివాజీపార్కులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ హరికుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఎంవీపీ కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వల్ల మనుగడకు మంచిదని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం శివాజీ పార్కులో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం సమాచానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం నిరోధానికి ఇళ్లు, కార్యాలయాల ఆవరణ, మిద్దెలపై మొక్కలు పెంచాలని కోరారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నగరాన్ని తమ సొంత ఇంటిలా పౌరులు భావించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రతి వార్డులోనూ పరిశుభ్రత పోటీలు నిర్వహించి, అత్యంత స్వచ్ఛత గల వార్డులో రూ. 5లక్షల రూపాయలతో అదనపు పనులు ఆ వార్డులో చేస్తామని అన్నారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ఏదైనా సాధ్యమని అన్నారు. శివాజీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు ఫొటోలు తీయించుకున్నారు. అదనపు కమిషనర్‌లు రమణమూర్తి, సోమన్నారాయణ, ఇతర అధికారులు, పలు వార్డుల కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జేడీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న రైతు బజారులోని రైతులు

28వ వార్డులో ఎన్టీఆర్ వర్ధంతి

రామ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29 వర్ధంతిని 28వ వార్డులో ఘనంగా నిర్వహించారు. రామ్‌నగర్ జంక్షన్‌లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం మహిళలు, పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఎ.అప్పలనారాయణ, ఉరుకూటి పైడిరాజు, సారిపల్లి మహేష్, నడిగట్ల శంకర్‌రావు, డిల్లీశ్వరీ, మంగమ్మ, సావిత్రి , అమ్ములు తదితరులు పాల్గొన్నారు

ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లకు త్రిపుర గవర్నర్ నివాళి


ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, చిత్రంలో హాస్య నటుడు బ్రహ్మానందం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమానికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి శనివారం సాయంత్రం ఏయూలోని హిందీ విభాగాన్ని సందర్శించారు. ఏయూ అంబేడ్కర్ హాలుల నిర్వహించిన ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంతుత్సవాల్లో పాల్గొన్నారు.

ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు ఇంద్రసేనారెడ్డికి ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవం


త్యాగరాజ స్వామి కృతులు ఆలపిస్తున్న 150 మంది కళాకారులు

మద్దిలపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కళాభారతిలోని త్యాగరాజ స్వామి ఆలయంలో స్వామి వారికి, సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం త్యాగరాజస్వామి వారిని భక్త పరివారం పల్లకిలో పిఠాపురం కాలనీలో ఊరేగింపుగా తిరువీధి మహోత్సవం నిర్వహించారు. గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో ఉంచవృత్తి చేయగా, వంకాయల వెంకటరమణ మృదంగ వాయిద్యంలో అనేక మంది కళాకారులు త్యాగరాజ కృతులు ఆలపిస్తూ అంగరంగా వైభవంగా తిరువీధి మహోత్సవం సాగింది. దారి పొడుగున భక్తులు స్వామి వారికి పూజలు చేస్తు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాభారతి ప్రాంగణంలో త్యాగరాజస్వామివారిని ప్రతిష్ఠించి కీర్తనలు ఆలపించారు. 150 మంది కళాకారులు త్యాగరాజస్వామి ఘనరాగ పంచరత్న కృతులతో బృందగానం చేసి భక్తపారవశ్యంలో గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. ఈ ఉత్సవాల్లో ట్రస్టు నిర్వహకులు మంతెన సత్యనారాయణరాజు, రాంబాబుపాల్గొన్నారు.


తిరువీధి ఉత్సవంలో స్వామి వారిని పల్లకిపై ఊరేగింపు

గాయపడిన మహిళ మృతి

ఆరిలోవ, జనవరి 18 : (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయి ఫారానికి సమీపంలో గల ఇందిరానగర్‌లో ఓ ఇంట్లో డిసెంబరు 25న గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడిన సత్యవతి (27) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు మరో నలుగురికి గాయాలైన సంగతి తెలిసిందే. వీరంతా వెంకోజీపాలెంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలో చేరారు. వీరంతా కోలుకోగా, అప్పటి నుంచి సత్యవతి చికిత్స పొందుతూ వచ్చింది. సత్యవతి మృతి చెందారు. ఆమె మృతితో ఇందిరానగర్‌లో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 54 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 32, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

విమ్స్‌లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్


విమ్స్ ఎదుట పరిసరాలు శుభ్రపరుస్తున్న డైరెక్టర్ డా.రాంబాబు, వైద్యులు


ఆరిలోవ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో శనివారం ఆస్పత్రి సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఆయనతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్ని ఆస్పత్రి పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలనేది నిత్యం అందరూ చేయాల్సిన కార్యక్రమం అన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి ఎల్లప్పుడు తాను మాత్రమే కాకుండా తాను ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విమ్స్ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు వైద్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా నెత్తల పరస


పరసలో ఏర్పాటు చేసిన చిరు దుకాణాల వద్ద సరుకులు కొనుగోలు చేస్తున్న స్థానికులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులో గల ఇసుకతోటలో నిర్వహించే నెత్తల పరస శనివారం కన్నుల వేడకగా సాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సాగిన ఈ పరసలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు పలు గృహోపకరణాలను విక్రయించారు. ఈ సందర్భంగా గ్రామం మధ్యలో ఉన్న రామాలయం, నంది ఆలయాన్ని అత్యంత సుందరంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. సాముగరిడీ, కోలాటం, నేలవేషాలు, బుర్రకథ తదితర జానపద కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా మండలి అధ్యక్షులు వెంకటేశ్వరన్, చిన్నాబాబు, పెంటకోట రమేష్, కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు ముగడ వాసు, పల్లా ఉమారాణి, నారు గోపి, ఈగల సత్యం, బొట్టా శివ, బొట్టా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు న్యాయమూర్తి సత్కరిస్తున్న న్యాయ కళాశాల పిన్సిపాల్ సీతామాణిక్యం తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం కళాశాల ఆచార్యులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని ఈ సందర్భంగా న్యాయ కళాశాల తరపున ప్రిన్సిపాల్ సత్కరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు చంద్రకళ, డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ కార్యాయలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ముందుగా కమిషనర్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలను, అలాగే కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దస్త్రాల నిర్వహణ ఈ-ఆఫీస్ ద్వారా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్ , భవానీశంకర్, శిల్పా, హరిప్రసాద్, బలరామరాజు, శివానీ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : శివాజీ పార్కు గొడుగు వాకర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం బాదం పార్కు ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, కోశాధికారి ఎం.నందకుమార్, జాలీ వాకర్‌గా అప్పలరాజు మరో తొమ్మిది మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ వెంకట్రావు విచ్చేశారు.

కైలాసగిరిపై బ్యాటరీ కార్లకు అనుమతి రద్దు

- నిర్దేశించిన మొత్తం కంటే పర్యాటకుల వద్ద అధికంగా వసూలు చేస్తుండడంతో చర్యలు
- ఏఓ, ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వహణకు ఇచ్చిన అనుమతులను వీఎంఆర్‌డీఏ అధికారులు రద్దు చేశారు. ఈ అంశంపై ఈ నెల 11వ తేదీన 'కైలాసగిరిపై బ్యాటరీ కార్ల దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ స్పందించి కైలాసగిరిని సందర్శించి బ్యాటరీ కార్ల నిర్వహణ, వసూలు చేస్తున్న ఫీజులను పరిశీలించారు. నిర్ణయించిన దాని కంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నట్టుగా గుర్తించి, అధికారుల ద్వారా ఆరోజే షోకాజ్ నోటీసులు ఇప్పించారు. దీనిపై కమిషనర్ విశ్వనాథన్ విచారణ నిర్వహించి బ్యాటరీ కార్ల నిర్వహణ కోసం ఇద్దరు వ్యక్తులకు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

అదే సమయంలో కైలాసగిరిపై జరుగుతున్న వ్యవహారాలపై పర్యవేక్షణ కొరవడిందని గమనించి సంబంధిత పరిపాలనా అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. త్వరలోనే టెండర్ల ద్వారా బ్యాటరీ కార్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

స్టీల్ ప్లాంటుకు ప్యాకేజీ ప్రకటనపై బీజేపీ హర్షం



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

జగదాంబ కూడలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడాన్ని నగర బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జగదాంబ జంక్షన్ వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాశీవిశ్వనాథరాజు నేతృత్వంలో మోదీ చిత్రపటానికి నాయకుడు ప్రకాష్ రెడ్డి తదితరులు పాలాభిషేకం చేశారు. మోదీ ప్రకటనపై నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలియజేస్తూ నినాదాలు చేశారు.

నేడు మహా అన్నదానం

అల్లిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల ముగింపు నేపథ్యంలో అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై బల్లిగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రమాబాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని ప్రజలను కోరారు.

భూ విలువల సవరణ

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల
- నోటీస్ బోర్డులో 'కొత్త ప్రతిపాదనలు'
- **24 వరకూ అభ్యంతరాల స్వీకారం**
- ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల విలువలు సవరించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్లు అంతా కొత్త ప్రతిపాదనలు జిల్లా కమిటీకి సమర్పించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వాన ఏర్పాటైన కమిటీ వాటిని పరిశీలించి ఆమోదం తెలిపింది. వాటిని శనివారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ శనివారం తెలిపారు. వాటిపై అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ సబ్ రిజిస్ట్రార్, మండల తహసీల్దార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో తెలపవచ్చునన్నారు. వాటిని పరిశీలించి కమిటీ ముందు పెడతామన్నారు. చివరిగా ఖరారు చేసిన విలువలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. గతంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావించిందని, దానిని ఫిబ్రవరికి వాయిదా వేయడం వల్ల మళ్లీ ప్రతిపాదనలు, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు.

భీమిలి వైసీపీ సమన్వయకర్తగా చిన్న శ్రీను

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గ పరిశీలకునిగా కరణం ధర్మశ్రీని, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడును, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించింది.

తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్టీఆర్



ఐటీఐ జంక్షన్ వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీ భరత్, కార్తీక్ కుట్టా



మాధవధారలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

కంచరపాలెం/మర్రిపాలెం/అక్కయ్యపాలెం/దొండపర్తి/సీతమ్మధార/పూర్ణామార్కెట్/ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగ్గ నేత నందమూరి తారక రామారావు అని విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ శ్లాఘించారు.. జీవీఎంసీ 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్ కుట్టా ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఐటీఐ జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ మాట్లాడుతూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా జీవించి ఉండే వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం కార్తీక్ సమకూర్చిన పండ్లు, దుప్పట్లను ఎంపీ పేదలకు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పేదలకు వివిధ రకాల సహాయం అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర నటుడుగా, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడిగా, ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలను అనేక పాత్రల్లో మెప్పించిన తీరును గుర్తు చేసుకుని మురిసిపోయారు. మర్రిపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, సీతంపేట, మాధవధార, మురళీనగర్, దొండపర్తి, పూర్ణామార్కెట్, అల్లిపురం తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి మాట్లాడుతూ బలహీనవర్గాల వారి అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేసి నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేసిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అక్కయ్యపాలెం, నరసింహనగర్, లక్ష్మీనారాయణపురం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో సందడిగా కార్యక్రమాలు జరిగాయి. శ్రీనగర్ కూరగాయల మార్కెట్, దొండపర్తి పాలికల వారి వీధి దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్రపటానికి కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి నివాళులర్పించారు. రైల్వే న్యూకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు పనిచేయాలని పాతనగరంలోని పలు ప్రాంతాల్లో సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. 50వవార్డులో టిడిపి కార్యాలయం నుంచి బిర్లా జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చిన అభిమానులు అక్కడి ఎన్టీఆర్ స్మారక విగ్రహానికి పూలదండలతో నివాళులర్పించారు. సామాన్యునిగా జన్మించి తెలుగు తేజంగా ఎదిగిన ఎన్టీఆర్ ఓ మరపురాని మనిషి అని విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి అన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ



పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు వద్ద ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

ఆకట్టుకున్న జలకన్యల ప్రదర్శన

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు పోలీస్ మెస్ వెనుక ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన జలకన్యల ప్రదర్శన, కశ్మీర్ అందాల సిటీ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. కశ్మీర్ మంచు కొండల్లో ఉన్నామా? అన్న అనుభూతి కలిగిస్తోంది. జలకన్యలు, కొండలపై నిరంతరం ప్రవహించే జలపాతం, కశ్మీర్‌లో విస్తృతంగా ఉండే యాపిల్ చెట్లు, మంచుతో కప్పుకుపోయిన ఇళ్లు వంటివి అమితంగా ఆకట్టుకుంటున్నాయి. నగరవాసులు, పర్యాటకులు ఈ ప్రదర్శనలో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 50కి పైగా స్టాల్స్ ఆశ్చర్యపరిచే విధంగా డబుల్ రేంజర్, టోరాటోరా, మేరీ కొలంబస్, వివిధ రకాల వస్త్రాల షాపింగ్, ప్రత్యేకంగా ప్రవేశ ద్వారం వద్ద సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ప్రతిమలు ఎంతగానో ఆకటుకుంటున్నాయని, విశాఖ వాసులు సందర్శించాలని ఎగ్జిబిషన్ ప్రతినిధి రాజారెడ్డి కోరారు.



ఎగ్జిబిషన్‌లో అందాల కశ్మీర్ సెట్‌ను తిలకిస్తున్న సందర్శకులు

ప్రధాన గెడ్డకు అడ్డుతెరలు ఏర్పాటు చేయండి

- ఇంజనీర్లకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- విద్యుత్ దీపాలతో స్తంభాలు లేకపోవడంపై ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అక్కయ్యపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికులు వ్యర్థాలు వేయకుండా గ్రేటర్ 43వ వార్డు నరేంద్రనగర్‌లోని ప్రధాన గెడ్డకు ఇరువైపులా అడ్డు తెరలు (మెష్‌లు) ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. ఇనుప వంతెన బదులు ఆర్‌సీసీ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు పరిశీలించి పనులు ప్రారంభించాలని పర్యవేక్షక ఇంజనీర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన నరేంద్రనగర్, ఎంఎస్ఎఫ్-5, తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి పర్యటించారు. వార్డులోని సమస్యలు పరిష్కరించాలని ఆమె కమిషనర్‌ను కోరారు. కాలనీలో పలుచోట్ల విద్యుత్ దీపాలతో స్తంభాలు లేకపోవడం చూసి సంబంధిత కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్‌ను చూసి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కేబుల్ ఆపరేటర్ల యాజమాన్యంతో చర్చించి వాటిని క్రమబద్ధీకరించాలని ఏసీపీ శాస్త్రిని ఆదేశించారు. వార్డులో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, గెడ్డలు, కాల్వల్లో వ్యర్థాలు తొలగింపు తదితర చర్యలు చేపట్టడంతో పాటు నిత్యం పర్యవేక్షించాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌ను ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెం దగ్గర ఉన్న ఎస్ఎంఎఫ్-5ను పరిశీలించి ఏ రోజు వ్యర్థాలు ఆ రోజు నిల్వ లేకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్ బి.రాముని సూచించారు. నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. జోన్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, తారా ప్రసన్న, శానిటరీ సూపర్‌వైజర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైనిక దినోత్సవం



ఆర్కేబీచ్‌లో నిర్వహిస్తున్న కవాతులో నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ పెందల్కర్ తదితరులు

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగరతీరంలో మొట్టమొదటిసారి శనివారం సైనిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ ఆర్మ్‌డు డే వేడుకల్లో ఇండియన్ నేవీ తో పాటు ఆర్మ్‌డు ఫోర్స్‌లో వివిధ విభాగాలకు చెందిన విశ్రాంత సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెందల్కర్, రిటైర్డ్ వైస్ అడ్మిరల్ వీకే నంబ్లా, డాక్టర్ వి.చంద్రశేఖర్‌లు జెండా ఊపి వేడుకలు ప్రారంభించారు. విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు విశ్రాంత సైనిక ఉద్యోగులు కవాతు నిర్వహించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పరస్పరం పలకరించుకుంటూ ఆత్మీయ ఆలింగనాలు, కరచాలనాలు చేసుకున్నారు. ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు. దేశభక్తిని ప్రతిబింబించే నేవల్ బ్యాండ్‌ను తిలకించారు. అల్పాహార విందు ఆరగిస్తూ తమ విధి నిర్వహణలో ఎదుర్కొన్న కష్టసుఖాలు, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, సుమారు 500 మంది మాజీ సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

అక్కర్లేదన్నారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల తరువాత లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మరోసారి బిల్లుల సంగతి ప్రస్తుత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముదపాక, గొల్లలపాలెంలో ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల అభ్యర్థన మేరకు డీపీఆర్ ఆమోదించాలని ఉన్నతాధికారులకు ఏఈలు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 73 లేఅవుట్‌లలో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లు ఎన్ని?, ఏ మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉందనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సుమారు పది వేల మంది వరకూ లబ్ధిదారులు తమకు కేటాయించిన చోట కాకుండా మరోచోట ప్లాట్లు కేటాయించాలని కోరుతున్నారు. మరోవైపు ప్లాట్లు మంజూరు చేసిన తరువాత జీవీఎంసీ అధికారులు విచారణ చేపట్టగా వందల మంది అనర్హులుగా తేలారు. అప్పటికే అక్కడ ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు ప్రారంభించేశారు. అటువంటి ఇళ్లకు బిల్లులు ఇవ్వరు. ఈ విషయంలో హౌసింగ్ సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు మధ్య సమన్వయం లేదనే వాదన ఉంది. జిల్లాలోని లేఅవుట్‌లలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇళ్లు ఎన్ని?, లబ్ధిదారులకు ఇష్టం లేకుండా నిర్మించినవి ఎన్ని?...అనేవి తేలాల్సి ఉంది. ఒకేసారి లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే ఆదుర్దాతో గత పాలకులు తగిన కసరత్తు చేయకపోవడమే ప్రస్తుత గందరగోళానికి కారణమని హౌసింగ్ సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు.

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

... 5వ పేజీ తరువాయి

అనేక అంశాలు కారణమవుతున్నాయి. కట్నం, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ వేధింపులకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. అలాగే అనుమానాలు, అపోహలు, మనస్పర్ధలు, సెల్‌ఫోన్ తెచ్చిన చిక్కులతో కూడిన కేసులు కూడా ఉంటున్నాయి. చాలామంది తాము విడిపోతామని, కలిసి ఉండలేని పరిస్థితికి చేరామంటూ అధికారులు వద్దకు వస్తున్నారు. వీరి సమస్యను సావధానంగా వింటున్న అధికారులు ఇరువర్గాలను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ నిర్వహించి కలిసి ఉండేలా చేస్తున్నారు. గతంతో పోలిస్తే కౌన్సెలింగ్‌తో కలిసి ఉండేందుకు సిద్ధమవుతున్న జంటల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

గడిచిన ఏడాది కాలంలో మొత్తం 3,716 కేసులు నమోదు కాగా, వీటిలో ఇప్పటివరకూ 474 కేసులను కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పరిష్కరించారు. మరికొన్ని కేసులు కౌన్సెలింగ్ దశలో ఉన్నాయి. కొన్ని కోర్టు వరకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. 1,104 కేసులు కోర్టుల్లో క్లియర్ అయ్యాయని, బాధితులకు నష్ట పరిహారాన్ని అందించేలా చేశామని అధికారులు వెల్లడించారు.

దఫదఫాలుగా చర్చలు

ఈ సెల్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితురాలితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, భర్తతో అధికారులు దఫదఫాలుగా చర్చలు జరుపుతారు. భార్యభర్తతోపాటు వారి కుటుంబ సభ్యులు, అవసరమైతే కౌన్సిలర్లు ఆ ప్రాంతానికి చెందిన పెద్ద మనుషులను రప్పించి మాట్లాడ తారు. సమస్య ఎవరి వైపు ఉందో తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. భార్యను వేధించడం తగదని, సర్దుబాటు చేసుకుని దాంపత్య జీవితం కొనసాగించాలని భర్తకు సూచిస్తారు. కాదు, కూడ దంటే చట్టపరంగా ఉన్న ఇబ్బందులను తెలియజేస్తారు. మరోవైపు అమ్మాయిలో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వ హిస్తారు. విడిపోతే ఎదురయ్యే ఇబ్బందులు, సమాజం ఎలా చూస్తుందన్న విషయాలను తెలియజేస్తారు. ఇరువురితో వేర్వేరుగా మాట్లాడి అన్ని అంశాలను కూలంకుశంగా వివరించి రాజీకి వచ్చేలా అధికారులు కృషిచేస్తున్నారు.

ఐదేళ్లలోపు జంటలే ఎక్కువ..

పెళ్లై ఐదేళ్లు కూడా కాని జంటలే ఎక్కువగా సెల్‌కు వస్తున్నాయి. తక్కువ వయసు కావడం, ఇగోలకు పోవడంతో సమస్య తీవ్రతరం అవుతోందని అధికారులు చెబుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఎంతో మంది వైవాహిక జీవితాలను నిలబట్టే ప్రయత్నం చేస్తున్నామని డీవీ సెల్ అధికారి జ్యోతి వెల్లడించారు. గతంతో పోలిస్తే రాజీకి అంగీకరిస్తున్న వారి సంఖ్య గడిచిన ఏడాది కొంత మెరుగ్గా ఉందన్నారు. ఇద్దరూ ఉద్యోగులైన జంటల్లో ఈ సమస్య కొంత అధికంగా ఉందని పేర్కొన్నారు.

సొంత గనులు కూడా సాధిస్తాం

... 5వ పేజీ తరువాయి

పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా గుర్తింపు పొందిన విశాఖ ఉక్కును కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ఈ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారన్నారు. ప్లాంటుకు అవసరమైన ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్లాంటుకు సొంత గనులు కూడా సాధించి విశాఖ ఉక్కును దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపేలా చేస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంటు సమస్యపై అనేకసార్లు ప్రధాని మోదీతో పవన్ కళ్యాణ్ మాట్లాడారని, కూటమి నేతల కృషి వల్లనే అన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంఎస్ఎంఈల కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకర్, పార్టీ నాయకులు కోన తాతారావు మాట్లాడారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత



మర్రిపాలెంలో డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న సిబ్బంది



సీతమ్మధార రైతుబజార్‌ను శుభ్రం చేస్తున్న ఎస్టేట్ అధికారి, సిబ్బంది

విశాఖపట్నం/అక్కయ్యపాలెం/సీతంపేట/, అల్లిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత మనందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. మర్రిపాలెంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కార్యాలయంలో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన కార్యాలయం పరిసరాలను సీఈవో డీవీఎస్. వర్మ, సిబ్బంది శుభ్రపరిచారు. ప్రభుత్వం అమలుచేసిన స్వచ్ఛ దివస్ ప్రాధాన్యతను వివరిస్తూ ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్లు అన్నపూర్ణ, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 31 బ్రాంచిలలో స్వచ్ఛ దివస్ చేపట్టారు. గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులో స్వచ్ఛతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి సంఘ సేవకుడు వీవీ రాజు, కార్యదర్శి జపుల్లా ఖాన్ పార్కులోని వ్యర్థాలు, తొలగించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సూపర్‌వైజర్ రాజు పాల్గొన్నారు. 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో పార్కులో చెత్తను తొలగించారు. అనంతరం ఆయన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సీతమ్మధార రైతుబజార్‌ను శుభ్రం చేశారు. రైతులు, ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జోన్-4 ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో జోన్ వైద్యాధికారి కృష్ణంరాజు పర్యవేక్షణలో కెప్టెన్ రామారావు జంక్షన్, అల్లిపురం, సరస్వతిపార్కు ప్రాంతాల్లో స్వచ్ఛత నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి రోడ్లు, పార్కులను శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



జోన్-4 పరిధిలో సిబ్బంది స్వచ్ఛత ర్యాలీ



అబిద్‌నగర్‌లో పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

ఏడు నెలల్లో ఏపీకి రూ.4 లక్షల కోట్లు

రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు



విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కేంద్రం సహకారంతో దూసుకుపోతున్నదని బీజేపీ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. హోటల్ మేఘాలయలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు నెలల కాలంలో ఏపీకి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రధాని మోదీ 3.0 లో ఇచ్చిన అత్యధిక ప్యాకేజీ ఇదేనన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్ల చేయూత, పోలవరానికి రూ.2,800 కోట్లు, ఇప్పుడు స్టీల్ ప్లాంటుకు రూ.11,440 కోట్లు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం ప్రారంభమైందని, రైల్వే జోన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. సైబర్ క్రైమ్ కేసులు ఏటా పదిశాతం పెరుగుతున్నాయని, కేంద్రం సహకారంతో పోరాటం చేస్తామని జీవీఎల్ చెప్పారు. అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌తో ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు.

ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు నూతనశక్తి

... 5వ పేజీ తరువాయి

మరోసారి సహకారం కోసం వేచి చూసే పరిస్థితి రాకూడదన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్యాకేజీకి పదింతలు భవిష్యత్తులో తిరిగి దేశానికి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్యాకేజీ ద్వారా ప్లాంటు కార్యకలాపాలకు నూతనశక్తి వస్తుందన్నారు. గతంలో వాజపేయి హయాంలో అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, దివంగత ఎర్రన్నాయుడు, విశాఖ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి కలిసి ప్లాంటును కాపాడారని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు, భారత ప్రధాని నరేంద్రమోదీ, నిర్మలాసీతారామన్, కుమార్‌స్వామితో చర్చించడంతో రివైవల్ ప్యాకేజీ ప్రకటించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో సంస్థాగతంగా సమూల మార్పులు తీసుకువచ్చేలా, ఆ దిశగా ఉక్కు మంత్రిత్వశాఖ ముందడుగు వేసేలా స్థానిక ఎంపీగా బాధ్యత తీసుకుంటానని శ్రీభరత్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉక్కు కర్మాగారం రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి అభ్యర్థిగా తాను ఇచ్చిన ఏడు హామీల్లో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూస్తానన్నది ఒకటని శ్రీభరత్ పేర్కొన్నారు. దానికి కట్టుబడి లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేసిన వెంటనే కేంద్ర ఉక్కుమంత్రి కుమార్‌స్వామి వద్దకు వెళ్లి కర్మాగారం గురించి వివరించానన్నారు. పలు సందర్భాలలో కేంద్ర మంత్రులను కలిసినపుడు ఇక్కడ పరిస్థితి వివరించి కార్మికులకు భరోసా కల్పించానన్నారు. కీలక పోస్టుల్లో సమర్థులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర క్యాబినెట్‌ను ఒప్పించి ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి శ్రీభరత్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, నగరంలోని దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, మళ్ల రవికుమార్ తదితరులు



మద్దిలపాలెం : వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గుడ్ల విజయసాయి



ఎంవీపీ కాలనీ : ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ మంగమణి, పలువురు టీడీపీ నేతలు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

- టీడీపీ నేతల ఆధ్వర్యంలో వాడవాడలా సంక్షేమ కార్యక్రమాలు
- సినీ, రాజకీయ రంగాల్లో అందించిన సేవలను కొనియాడిన వక్తలు

మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. తూర్పు నియోజకవర్గంలోని వివిధ చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, అభిమానులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో వక్తలు మాట్లాడుతూ సినీ రంగానికి ఆయన అందించిన సేవలు, రాజకీయ రంగంలో ఆయన చేపట్టిన సంక్షేమ, సంస్కరణలను కొనియాడారు.

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట, కేఆర్ఎం కాలనీ, రజకవీధి ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహానికి వార్డు అధ్యక్షులు నారు గోపి, నాయకులు ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, మొల్లి శోభ జి.అప్పన్న, బంగార్రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే 15వ వార్డులోని హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, ద్రాక్షవరపు వరలక్ష్మి, సీహెచ్ గోవింద్, సూరి బాబు, నరేంద్ర, కె.మహేష్, కర్రి గౌరీ, నూకరాజు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : గ్రేటర్ విశాఖ 23వ వార్డులో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి ఆధ్వర్యంలో ప్రియదర్శినికాలనీలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి దంపతులు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గొలగాని పురుషోత్తం, అచ్చి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే 22వ వార్డులోని మంగాపురంకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, ఆనంద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డులోని అప్పుఘర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పోలారావు, నాయకులు నూకరాజు, రవి, హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 17వ వార్డులోని ఆదర్శనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ వార్డు నేతలు కాళ్ళ శంకర్, జిల్లా కార్యదర్శి సత్తిబాబు, రాములమ్మ, వర, గోపమ్మ, నరేంద్ర, రాజు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : గ్రేటర్ విశాఖ 13వ వార్డులోని దుర్గా బజార్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ కార్యదర్శి యల్లమల్లి సురేష్, వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు 200 మందికి దుస్తులు, పండ్లు, బియ్యం అందించారు. జనసేన నేతలు నీలి పైడి రాజు, సన్ని తదిదతరలు పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులోని గాంధీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పూలమాలలు వేసి నివాలలు అర్పించారు. బైరెడ్డి పోతనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంస్కర్త ఎన్టీఆర్ : భీమిలి ఎమ్మెల్యే గంటా



మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సంక్షేమ పథకాలను పరిచయం చేసిన సంస్కర్త అన్న ఎన్టీఆర్ అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆర్కే బీచ్ దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు' నినాదంతో రాజకీయ పార్టీ పెట్టిన 9 నెలల్లోనే 100 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో సహా పెకిలించిన ఘన ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు ప్రసరింపజేసిన ఎన్టీఆర్ కారణజన్ముడని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు కోటి పార్టీ సభ్యత్వాలతో ప్రభంజనం సృష్టించారన్నారు. పార్టీకి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తల కోసం ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎం శ్రీభరత్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తే మనుగడకు మేలు

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో మేయర్ హరి వెంకటకుమారి



శివాజీపార్కులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ హరికుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఎంవీపీ కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వల్ల మనుగడకు మంచిదని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం శివాజీ పార్కులో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం సమాజానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం నిరోధానికి ఇళ్లు, కార్యాలయాల ఆవరణ, మిద్దెలపై మొక్కలు పెంచాలని కోరారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నగరాన్ని తమ సొంత ఇంటిలా పౌరులు భావించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రతి వార్డులోనూ పరిశుభ్రత పోటీలు నిర్వహించి, అత్యంత స్వచ్ఛత గల వార్డులో రూ. 5లక్షల రూపాయలతో అదనపు పనులు ఆ వార్డులో చేస్తామని అన్నారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ఏదైనా సాధ్యమని అన్నారు. శివాజీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు ఫొటోలు తీయించుకున్నారు. అదనపు కమిషనర్‌లు రమణమూర్తి, సోమన్నారాయణ, ఇతర అధికారులు, పలు వార్డుల కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జేడీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న రైతు బజారులోని రైతులు

28వ వార్డులో ఎన్టీఆర్ వర్ధంతి

రామ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29 వర్ధంతిని 28వ వార్డులో ఘనంగా నిర్వహించారు. రామ్‌నగర్ జంక్షన్‌లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం మహిళలు, పేదలకు పండ్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఎ.అప్పలనారాయణ, ఉరుకూటి పైడిరాజు, సారిపల్లి మహేష్, నడిగట్ల శంకర్‌రావు, ఢిల్లీశ్వరీ, మంగమ్మ, సావిత్రి , అమ్ములు తదితరులు పాల్గొన్నారు

ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లకు త్రిపుర గవర్నర్ నివాళి



ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, చిత్రంలో హాస్య నటుడు బ్రహ్మానందం, యార్లగడ్డ లక్ష్మీపసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమానికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి శనివారం సాయంత్రం ఏయూలోని హిందీ విభాగాన్ని సందర్శించారు. ఏయూ అంబేడ్కర్ హాలులో నిర్వహించిన ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంతుత్సవాల్లో పాల్గొన్నారు.

ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు ఇంద్రసేనారెడ్డికి ఏయూ వీసీ జి.శశి భూషణరావు, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవం



త్యాగరాజ స్వామి కృతులు ఆలపిస్తున్న 150 మంది కళాకారులు

మద్దిలపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కళాభారతిలోని త్యాగరాజ స్వామి ఆలయంలో స్వామి వారికి, సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం త్యాగరాజస్వామి వారిని భక్త పరివారం పల్లకిలో పిఠాపురం కాలనీలో ఊరేగింపుగా తిరువీధి మహోత్సవం నిర్వహించారు. గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో ఊంచవృత్తి చేయగా, వంకాయల వెంకటరమణ మృదంగ వాయిద్యంలో అనేక మంది కళాకారులు త్యాగరాజ కృతులు ఆలపిస్తూ అంగరంగా వైభవంగా తిరువీధి మహోత్సవం సాగింది. దారి పొడుగున భక్తులు స్వామి వారికి పూజలు చేస్తు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాభారతి ప్రాంగణంలో త్యాగరాజస్వామివారిని ప్రతిష్ఠించి కీర్తనలు ఆలపించారు. 150 మంది కళాకారులు త్యాగరాజస్వామి ఘనరాగ పంచరత్న కృతులతో బృందగానం చేసి భక్తపారవశ్యంలో గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. ఈ ఉత్సవాల్లో ట్రస్టు నిర్వహకులు మంతెన సత్యనారాయణరాజు, రాంబాబుపాల్గొన్నారు.



తిరువీధి ఉత్సవంలో స్వామి వారిని పల్లకిపై ఊరేగింపు

గాయపడిన మహిళ మృతి

ఆరిలోవ, జనవరి 18 : (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయి ఫారానికి సమీపంలో గల ఇందిరానగర్‌లో ఓ ఇంట్లో డిసెంబరు 25న గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడిన సత్యవతి (27) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు మరో నలుగురికి గాయాలైన సంగతి తెలిసిందే. వీరంతా వెంకోజీపాలెంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలో చేరారు. వీరంతా కోలుకోగా, అప్పటి నుంచి సత్యవతి చికిత్స పొందుతూ వచ్చింది. సత్యవతి మృతి చెందారు. ఆమె మృతితో ఇందిరానగర్‌లో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 54 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 32, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

విమ్స్‌లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్



విమ్స్ ఎదుట పరిసరాలు శుభ్రపరుస్తున్న డైరెక్టర్ డా.రాంబాబు, వైద్యులు

ఆరిలోవ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో శనివారం ఆస్పత్రి సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఆయనతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్ని ఆస్పత్రి పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలనేది నిత్యం అందరూ చేయాల్సిన కార్యక్రమం అన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతగానో దోహపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి ఎల్లప్పుడు తాను మాత్రమే కాకుండా తాను ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విమ్స్ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు వైద్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా నెత్తల పరస



పరసలో ఏర్పాటు చేసిన చిరు దుకాణాల వద్ద సరుకులు కొనుగోలు చేస్తున్న స్థానికులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులో గల ఇసుకతోటలో నిర్వహించే నెత్తల పరస శనివారం కన్నుల వేడకగా సాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సాగిన ఈ పరసలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు పలు గృహోపకరణాలను విక్రయించారు. ఈ సందర్భంగా గ్రామం మధ్యలో ఉన్న రామాలయం, నంది ఆలయాన్ని అత్యంత సుందరంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. సాముగరిడీ, కోలాటం, నేలవేషాలు, బుర్రకథ తదితర జానపద కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా మండలి అధ్యక్షులు వెంకటేశ్వరన్, చిన్నాబాబు, పెంటకోట రమేష్, కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు ముగడ వాసు, పల్లా ఉమారాణి, నారు గోపి, ఈగల సత్యం, బొట్టా శివ, బొట్టా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి సత్కరిస్తున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం కళాశాల ఆచార్యులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని ఈ సందర్భంగా న్యాయ కళాశాల తరఫున ప్రిన్సిపాల్ సత్కరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు చంద్రకళ, డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ కార్యాయలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ముందుగా కమిషనర్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలను, అలాగే కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దస్త్రాల నిర్వహణ ఈ-ఆఫీస్ ద్వారా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్ , భవానీశంకర్, శిల్పా, హరిప్రసాద్, బలరామరాజు, శివానీ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : శివాజీ పార్కు గొడుగు వాకర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం బాదం పార్కు ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, కోశాధికారి ఎం.నందకుమార్, జాలీ వాకర్‌గా అప్పలరాజు మరో తొమ్మిది మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ వెంకట్రావు విచ్చేశారు.

కైలాసగిరిపై బ్యాటరీ కార్లకు అనుమతి రద్దు

- నిర్దేశించిన మొత్తం కంటే పర్యాటకుల వద్ద అధికంగా వసూలు చేస్తుండడంతో చర్యలు
- ఏఓ, ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వహణకు ఇచ్చిన అనుమతులను వీఎంఆర్‌డీఏ అధికారులు రద్దు చేశారు. ఈ అంశంపై ఈ నెల 11వ తేదీన కైలాసగిరిపై బ్యాటరీ కార్ల దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ స్పందించి కైలాసగిరిని సందర్శించి బ్యాటరీ కార్ల నిర్వహణ, వసూలు చేస్తున్న ఫీజులను పరిశీలించారు. నిర్ణయించిన దాని కంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నట్టుగా గుర్తించి, అధికారుల ద్వారా ఆరోజే షోకాజ్ నోటీసులు ఇప్పించారు. దీనిపై కమిషనర్ విశ్వనాథన్ విచారణ నిర్వహించి బ్యాటరీ కార్ల నిర్వహణ కోసం ఇద్దరు వ్యక్తులకు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

అదే సమయంలో కైలాసగిరిపై జరుగుతున్న వ్యవహారాలపై పర్యవేక్షణ కొరవడిందని గమనించి సంబంధిత పరిపాలనా అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. త్వరలోనే టెండర్ల ద్వారా బ్యాటరీ కార్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

స్టీల్ ప్లాంటుకు ప్యాకేజీ ప్రకటనపై బీజేపీ హర్షం



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

జగదాంబ కూడలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడాన్ని నగర బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జగదాంబ జంక్షన్ వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాశీవిశ్వనాథరాజు నేతృత్వంలో మోదీ చిత్రపటానికి నాయకుడు ప్రకాష్ రెడ్డి తదితరులు పాలాభిషేకం చేశారు. మోదీ ప్రకటనపై నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలియజేస్తూ నినాదాలు చేశారు.

నేడు మహా అన్నదానం

అల్లిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల ముగింపు నేపథ్యంలో అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై బల్లిగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రమాబాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని ప్రజలను కోరారు.

భూ విలువల సవరణ

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల
- నోటీస్ బోర్డులో 'కొత్త ప్రతిపాదనలు'
- 24 వరకూ అభ్యంతరాల స్వీకారం
- ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల విలువలు సవరించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్లు అంతా కొత్త ప్రతిపాదనలు జిల్లా కమిటీకి సమర్పించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వాన ఏర్పాటైన కమిటీ వాటిని పరిశీలించి ఆమోదం తెలిపింది. వాటిని శనివారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ శనివారం తెలిపారు. వాటిపై అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ సబ్ రిజిస్ట్రార్, మండల తహసీల్దార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో తెలపవచ్చునన్నారు. వాటిని పరిశీలించి కమిటీ ముందు పెడతామన్నారు. చివరిగా ఖరారు చేసిన విలువలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. గతంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావించిందని, దానిని ఫిబ్రవరికి వాయిదా వేయడం వల్ల మళ్లీ ప్రతిపాదనలు, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు.

భీమిలి వైసీపీ సమన్వయకర్తగా చిన్న శ్రీను

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గ పరిశీలకునిగా కరణం ధర్మశ్రీని, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడును, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించింది.

తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్టీఆర్



ఐటీఐ జంక్షన్ వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీ భరత్, కార్తీక్ కుట్టా



మాధవధారలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

కంచరపాలెం/మర్రిపాలెం/అక్కయ్యపాలెం/దొండపర్తి/సీతమ్మధార/పూర్ణామార్కెట్/ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగ్గ నేత నందమూరి తారక రామారావు అని విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ శ్లాఘించారు.. జీవీఎంసీ 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్ కుట్టా ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఐటీఐ జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ మాట్లాడుతూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా జీవించి ఉండే వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం కార్తీక్ సమకూర్చిన పండ్లు, దుప్పట్లను ఎంపీ పేదలకు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పేదలకు వివిధ రకాల సహాయం అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర నటుడుగా, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడిగా, ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలను అనేక పాత్రల్లో మెప్పించిన తీరును గుర్తు చేసుకుని మురిసిపోయారు. మర్రిపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, సీతంపేట, మాధవధార, మురళీనగర్, దొండపర్తి, పూర్ణామార్కెట్, అల్లిపురం తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి మాట్లాడుతూ బలహీనవర్గాల వారి అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేసి నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేసిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అక్కయ్యపాలెం, నరసింహనగర్, లక్ష్మీనారాయణపురం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో సందడిగా కార్యక్రమాలు జరిగాయి. శ్రీనగర్ కూరగాయల మార్కెట్, దొండపర్తి పాలికల వారి వీధి దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్రపటానికి కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి నివాళులర్పించారు. రైల్వే న్యూకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు పనిచేయాలని పాతనగరంలోని పలు ప్రాంతాల్లో సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. 50వవార్డులో టిడిపి కార్యాలయం నుంచి బిర్లా జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చిన అభిమానులు అక్కడి ఎన్టీఆర్ స్మారక విగ్రహానికి పూల దండలతో నివాళులర్పించారు. సామాన్యునిగా జన్మించి తెలుగు తేజంగా ఎదిగిన ఎన్టీఆర్ ఓ మరపురాని మనిషి అని విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి అన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ



పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు వద్ద ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

ఆకట్టుకున్న జలకన్యల ప్రదర్శన

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు పోలీస్ మెస్ వెనుక ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన జలకన్యల ప్రదర్శన, కశ్మీర్ అందాల సిటీ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. కశ్మీర్ మంచు కొండల్లో ఉన్నామా? అన్న అనుభూతి కలిగిస్తోంది. జలకన్యలు, కొండలపై నిరంతరం ప్రవహించే జలపాతం, కశ్మీర్‌లో విస్తృతంగా ఉండే యాపిల్ చెట్లు, మంచుతో కప్పుకుపోయిన ఇళ్లు వంటివి అమితంగా ఆకట్టుకుంటున్నాయి. నగరవాసులు, పర్యాటకులు ఈ ప్రదర్శనలో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 50కి పైగా స్టాల్స్ ఆశ్చర్యపరిచే విధంగా డబుల్ రేంజర్, టోరాటోరా, మేరీ కొలంబస్, వివిధ రకాల వస్త్రాల షాపింగ్, ప్రత్యేకంగా ప్రవేశ ద్వారం వద్ద సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ప్రతిమలు ఎంతగానో ఆకటుకుంటున్నాయని, విశాఖ వాసులు సందర్శించాలని ఎగ్జిబిషన్ ప్రతినిధి రాజారెడ్డి కోరారు.



ఎగ్జిబిషన్‌లో అందాల కశ్మీర్ సెట్‌ను తిలకిస్తున్న సందర్శకులు

ప్రధాన గెడ్డకు అడ్డుతెరలు ఏర్పాటు చేయండి

- ఇంజనీర్లకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- విద్యుత్ దీపాలతో స్తంభాలు లేకపోవడంపై ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అక్కయ్యపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికులు వ్యర్థాలు వేయకుండా గ్రేటర్ 43వ వార్డు నరేంద్రనగర్‌లోని ప్రధాన గెడ్డకు ఇరువైపులా అడ్డు తెరలు (మెష్‌లు) ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. ఇనుప వంతెన బదులు ఆర్‌సీసీ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు పరిశీలించి పనులు ప్రారంభించాలని పర్యవేక్షక ఇంజనీర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన నరేంద్రనగర్, ఎంఎస్‌ఎఫ్-5, తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి పర్యటించారు. వార్డులోని సమస్యలు పరిష్కరించాలని ఆమె కమిషనర్‌ను కోరారు. కాలనీలో పలుచోట్ల విద్యుత్ దీపాలతో స్తంభాలు లేకపోవడం చూసి సంబంధిత కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్‌ను చూసి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కేబుల్ ఆపరేటర్ల యాజమాన్యంతో చర్చించి వాటిని క్రమబద్ధీకరించాలని ఏసీపీ శాస్త్రిని ఆదేశించారు. వార్డులో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, గెడ్డలు, కాల్వల్లో వ్యర్థాలు తొలగింపు తదితర చర్యలు చేపట్టడంతో పాటు నిత్యం పర్యవేక్షించాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌ను ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెం దగ్గర ఉన్న ఎస్‌ఎంఎఫ్-5ను పరిశీలించి ఏ రోజు వ్యర్థాలు ఆ రోజు నిల్వ లేకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్ బి.రాముకు సూచించారు. నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. జోన్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, తారా ప్రసన్న, శానిటరీ సూపర్‌వైజర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైనిక దినోత్సవం



ఆర్కేబీచ్‌లో నిర్వహిస్తున్న కవాతులో నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ పెందల్కర్ తదితరులు

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగరతీరంలో మొట్టమొదటిసారి శనివారం సైనిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ ఆర్మ్‌డు డే వేడుకల్లో ఇండియన్ నేవీ తో పాటు ఆర్మ్‌డు ఫోర్స్‌లో వివిధ విభాగాలకు చెందిన విశ్రాంత సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెందల్కర్, రిటైర్డ్ వైస్ అడ్మిరల్ వీకే నంబ్లా, డాక్టర్ వి.చంద్రశేఖర్‌లు జెండా ఊపి వేడుకలు ప్రారంభించారు. విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు విశ్రాంత సైనిక ఉద్యోగులు కవాతు నిర్వహించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పరస్పరం పలకరించుకుంటూ ఆత్మీయ ఆలింగనాలు, కరచాలనాలు చేసుకున్నారు. ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు. దేశభక్తిని ప్రతిబింబించే నేవల్ బ్యాండ్‌ను తిలకించారు. అల్పాహార విందు ఆరగిస్తూ తమ విధి నిర్వహణలో ఎదుర్కొన్న కష్టసుఖాలు, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, సుమారు 500 మంది మాజీ సైనికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

అక్కర్లేదన్నారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల తరువాత లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మరోసారి బిల్లుల సంగతి ప్రస్తుత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముదపాక, గొల్లలపాలెంలో ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల అభ్యర్థన మేరకు డీపీఆర్ ఆమోదించాలని ఉన్నతాధికారులకు ఏఈలు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 73 లేఅవుట్‌లలో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లు ఎన్ని?, ఏ మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉందనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సుమారు పది వేల మంది వరకూ లబ్ధిదారులు తమకు కేటాయించిన చోట కాకుండా మరోచోట ప్లాట్లు కేటాయించాలని కోరుతున్నారు. మరోవైపు ప్లాట్లు మంజూరు చేసిన తరువాత జీవీఎంసీ అధికారులు విచారణ చేపట్టగా వందల మంది అనర్హులుగా తేలారు. అప్పటికే అక్కడ ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు ప్రారంభించేశారు. అటువంటి ఇళ్లకు బిల్లులు ఇవ్వరు. ఈ విషయంలో హౌసింగ్ సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు మధ్య సమన్వయం లేదనే వాదన ఉంది. జిల్లాలోని లేఅవుట్‌లలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇళ్లు ఎన్ని?, లబ్ధిదారులకు ఇష్టం లేకుండా నిర్మించినవి ఎన్ని?...అనేవి తేలాల్సి ఉంది. ఒకేసారి లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే ఆదుర్దాతో గత పాలకులు తగిన కసరత్తు చేయకపోవడమే ప్రస్తుత గందరగోళానికి కారణమని హౌసింగ్ సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు.

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

... 5వ పేజీ తరువాయి

అనేక అంశాలు కారణమవుతున్నాయి. కట్నం, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ వేధింపులకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. అలాగే అనుమానాలు, అపోహలు, మనస్పర్ధలు, సెల్‌ఫోన్ తెచ్చిన చిక్కులతో కూడిన కేసులు కూడా ఉంటున్నాయి. చాలామంది తాము విడిపోతామని, కలిసి ఉండలేని పరిస్థితికి చేరామంటూ అధికారులు వద్దకు వస్తున్నారు. వీరి సమస్యను సావధానంగా వింటున్న అధికారులు ఇరువర్గాలను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ నిర్వహించి కలిసి ఉండేలా చేస్తున్నారు. గతంతో పోలిస్తే కౌన్సెలింగ్‌తో కలిసి ఉండేందుకు సిద్ధమవుతున్న జంటల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

గడిచిన ఏడాది కాలంలో మొత్తం 3,716 కేసులు నమోదు కాగా, వీటిలో ఇప్పటివరకూ 474 కేసులను కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పరిష్కరించారు. మరికొన్ని కేసులు కౌన్సెలింగ్ దశలో ఉన్నాయి. కొన్ని కోర్టు వరకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. 1,104 కేసులు కోర్టుల్లో క్లియర్ అయ్యాయని, బాధితులకు నష్ట పరిహారాన్ని అందించేలా చేశామని అధికారులు వెల్లడించారు.

దఫదఫాలుగా చర్చలు

ఈ సెల్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితురాలితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, భర్తతో అధికారులు దఫదఫాలుగా చర్చలు జరుపుతారు. భార్యభర్తతోపాటు వారి కుటుంబ సభ్యులు, అవసరమైతే కొన్నిసార్లు ఆ ప్రాంతానికి చెందిన పెద్ద మనుషులను రప్పించి మాట్లాడ తారు. సమస్య ఎవరి వైపు ఉందో తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. భార్యను వేధించడం తగదని, సర్దుబాటు చేసుకుని దాంపత్య జీవితం కొనసాగించాలని భర్తకు సూచిస్తారు. కాదు, కూడ దంటే చట్టపరంగా ఉన్న ఇబ్బందులను తెలియజేస్తారు. మరోవైపు అమ్మాయిలో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వ హిస్తారు. విడిపోతే ఎదురయ్యే ఇబ్బందులు, సమాజం ఎలా చూస్తుందన్న విషయాలను తెలియజేస్తారు. ఇరువురితో వేర్వేరుగా మాట్లాడి అన్ని అంశాలను కూలంకుశంగా వివరించి రాజీకి వచ్చేలా అధికారులు కృషిచేస్తున్నారు.

ఐదేళ్లలోపు జంటలే ఎక్కువ..

పెళ్లై ఐదేళ్లు కూడా కాని జంటలే ఎక్కువగా సెల్‌కు వస్తున్నాయి. తక్కువ వయసు కావడం, ఇగోలకు పోవడంతో సమస్య తీవ్రతరం అవుతోందని అధికారులు చెబుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఎంతో మంది వైవాహిక జీవితాలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని డీవీ సెల్ అధికారి జ్యోతి వెల్లడించారు. గతంతో పోలిస్తే రాజీకి అంగీకరిస్తున్న వారి సంఖ్య గడిచిన ఏడాది కొంత మెరుగ్గా ఉందన్నారు. ఇద్దరూ ఉద్యోగులైన జంటల్లో ఈ సమస్య కొంత అధికంగా ఉందని పేర్కొన్నారు.

సొంత గనులు కూడా సాధిస్తాం

... 5వ పేజీ తరువాయి

పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా గుర్తింపు పొందిన విశాఖ ఉక్కును కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ఈ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారన్నారు. ప్లాంటుకు అవసరమైన ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్లాంటుకు సొంత గనులు కూడా సాధించి విశాఖ ఉక్కును దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపేలా చేస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంటు సమస్యపై అనేకసార్లు ప్రధాని మోదీతో పవన్ కళ్యాణ్ మాట్లాడారని, కూటమి నేతల కృషి వల్లనే అన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంఎస్ఎంఈల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, పార్టీ నాయకులు కోన తాతారావు మాట్లాడారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు నూతనశక్తి

... 5వ పేజీ తరువాయి

మరోసారి సహకారం కోసం వేచి చూసే పరిస్థితి రాకూడదన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్యాకేజీకి పదింతలు భవిష్యత్తులో తిరిగి దేశానికి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్యాకేజీ ద్వారా ప్లాంటు కార్యకలాపాలకు నూతనశక్తి వస్తుందన్నారు. గతంలో వాజపేయి హయాంలో అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, దివంగత ఎర్రన్నాయుడు, విశాఖ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి కలిసి ప్లాంటును కాపాడారని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు, భారత ప్రధాని నరేంద్రమోదీ, నిర్మలాసీతారామన్, కుమార్‌స్వామితో చర్చించడంతో రివైవల్ ప్యాకేజీ ప్రకటించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో సంస్థాగతంగా సమూల మార్పులు తీసుకువచ్చేలా, ఆ దిశగా ఉక్కు మంత్రిత్వశాఖ ముందడుగు వేసేలా స్థానిక ఎంపీగా బాధ్యత తీసుకుంటానని శ్రీభరత్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉక్కు కర్మాగారం రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి అభ్యర్థిగా తాను ఇచ్చిన ఏడు హామీల్లో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూస్తానన్నది ఒకటని శ్రీభరత్ పేర్కొన్నారు. దానికి కట్టుబడి లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేసిన వెంటనే కేంద్ర ఉక్కుమంత్రి కుమార్‌స్వామి వద్దకు వెళ్లి కర్మాగారం గురించి వివరించానన్నారు. పలు సందర్భాలలో కేంద్ర మంత్రులను కలిసినపుడు ఇక్కడ పరిస్థితి వివరించి కార్మికులకు భరోసా కల్పించానన్నారు. కీలక పోస్టుల్లో సమర్థులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర క్యాబినెట్‌ను ఒప్పించి ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి శ్రీభరత్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, నగరంలోని దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

స్వచ్ఛత మనందరి బాధ్యత



మర్రిపాలెంలో డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న సిబ్బంది



సీతమ్మధార రైతుబజార్‌ను శుభ్రం చేస్తున్న ఎస్టేట్ అధికారి, సిబ్బంది

విశాఖపట్నం/అక్కయ్యపాలెం/సీతంపేట/, అల్లిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత మనందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. మర్రిపాలెంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కార్యాలయంలో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన కార్యాలయం పరిసరాలను సీఈవో డీవీఎస్. వర్మ, సిబ్బంది శుభ్రపరిచారు. ప్రభుత్వం అమలుచేసిన స్వచ్ఛ దివస్ ప్రాధాన్యతను వివరిస్తూ ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్లు అన్నపూర్ణ, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 31 బ్రాంచిలలో స్వచ్ఛ దివస్ చేపట్టారు. గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులో స్వచ్ఛతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి సంఘ సేవకుడు వీవీ రాజు, కార్యదర్శి జపుల్లా ఖాన్ పార్కులోని వ్యర్థాలు, తొలగించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సూపర్‌వైజర్ రాజు పాల్గొన్నారు. 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో పార్కులో చెత్తను తొలగించారు. అనంతరం ఆయన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సీతమ్మధార రైతుబజార్‌ను శుభ్రం చేశారు. రైతులు, ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జోన్-4 ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో జోన్ వైద్యాధికారి కృష్ణంరాజు పర్యవేక్షణలో కెప్టెన్ రామారావు జంక్షన్, అల్లిపురం, సరస్వతిపార్కు ప్రాంతాల్లో స్వచ్ఛత నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి రోడ్లు, పార్కులను శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



జోన్-4 పరిధిలో సిబ్బంది స్వచ్ఛత ర్యాలీ



అబిద్‌నగర్‌లో పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

ఏడు నెలల్లో ఏపీకి రూ.4 లక్షల కోట్లు

రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు



విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కేంద్రం సహకారంతో దూసుకుపోతున్నదని బీజేపీ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. హోటల్ మేఘాలయలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు నెలల కాలంలో ఏపీకి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రధాని మోదీ 3.0 లో ఇచ్చిన అత్యధిక ప్యాకేజీ ఇదేనన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్ల చేయూత, పోలవరానికి రూ.2,800 కోట్లు, ఇప్పుడు స్టీల్ ప్లాంటుకు రూ.11,440 కోట్లు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం ప్రారంభమైందని, రైల్వే జోన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. సైబర్ క్రైమ్ కేసులు ఏటా పదిశాతం పెరుగుతున్నాయని, కేంద్రం సహకారంతో పోరాటం చేస్తామని జీవీఎల్ చెప్పారు. అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌తో ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న సీఎండీ హేమంత్ ఖత్రీ

ముగిసిన షిప్‌యార్డు అధికారుల క్రీడా పోటీలు

మల్కాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం, సంక్రాంతి పండగను పురస్కరించుకుని హిందుస్థాన్ షిప్‌యార్డు ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి ఒక్క కార్మికుడు ప్రతిరోజు గంటపాటు క్రీడలు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో షిప్‌యార్డు డైరెక్టర్లు గిరిదీప్ సింగ్, వెంకటేశ్వర్లు, రాకేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణికుల కోసం 156 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం శనివారం 156 ప్రత్యేక బస్సులు నడిపింది. స్వస్థలాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చారు. పండగ ముగిశాక వారంతా తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు వివిధ రవాణా సాధనాలను వినియోగించుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్సులపై ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో రద్దీ పెరిగింది. షెడ్యూల్ సర్వీసులకు మించి ప్రయాణికుల డిమాండ్ ఉండడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. హైదరాబాద్‌కు 15, విజయవాడ 25, ఇచ్ఛాపురం 5, టెక్కలి 6, పలాస 8, రాజాం 8, పాలకొండ 10, విజయనగరం 10, బొబ్బిలి 2, రాజమండ్రి 12, కాకినాడకు 10 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేశారు. ఆదివారం కూడా మరిన్ని ప్రత్యేక బస్సులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. కరాసలోని సీసీ రోడ్లు, కాలువలు, రక్షణ గోడ పనులను తిలకించారు. ఆయా పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఉష, ఇంజనీరింగ్ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బంది, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 54 దొండకాయలు 42, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 36, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 58, దేముడుచిక్కుడు 62, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళీ 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 32, బ్రకోలి 80, నూల్ కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



పారిశ్రామిక ప్రాంతంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు



కూర్మన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

పేదల పెన్నిధి ఎన్టీఆర్

- వర్ధంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు
- ఇంటింటి ఆత్మబంధువు ఎన్టీఆర్: టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ

గోపాలపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదల పాలిట పెన్నిధి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అలాగే 88వ వార్డు పరిధి సత్తివానిపాలెంలో టీడీపీ నాయకుడు ఒమ్మి సత్యం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న నాయకులు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్: గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు అడుసుమల్లి దీప్తి, నమ్మి సింహాద్రి, అనంత్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్లాంటులో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకుడు బొడ్డు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు. 87వ వార్డు అప్పికొండ కాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.

పెందుర్తి: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పెందుర్తిలో కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇంటింటి ఆత్మబంధువు అని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ అమర్‌రహే టీడీపీ జిందాబాద్ అని నినాదాలు చేశారు. తొలుత లయోలా వృద్ధాశ్రమంలో గండి బాబ్జీ, పీలా శ్రీనుచేతులమీదుగా కార్యకర్తలు వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, నాయకులు కరక దేవుడు, సేనాపతి శంకరరావు, ఎ.అప్పలనాయుడు, దాట్ల మధు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు దివంగత ఎన్టీఆర్ అని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాదా శ్రీను, వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, నాగార్జున, గణపతి, జగదీశ్, త్రినాథ్, సత్య, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు. వడ్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గులు, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎం.రాము, శ్రీనివాసవర్మ, డీవీ అప్పారావు, వి.రాంబాబు, ఎస్.పెంటారావు, తదితరులు పాల్గొన్నారు. దువ్వాడలోని ఎన్టీఆర్ విగ్రహానికి 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఉరుకూటి శ్రీను, ఎం.రాము, ఒమ్మి రాము, రాజాన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు. యాదవజగ్గరాజుపేటలో ఎన్టీ రామారావు విగ్రహానికి టీడీపీ రాష్ట్ర నాయకుడు గొలగాని సన్యాసిరావు పుష్పమాల వేసి అంజలి ఘటించడారు. అదేవిధంగా టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పెందుర్తి కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గండి బాబ్జీ, పీలా శ్రీనివాసరావు, తదితరులు

మల్కాపురం: టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో రామకృష్ణపురంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా తెలుగు వాళ్లకు గుర్తింపు రావడానికి ఎన్టీఆర్ కారణమన్నారు. టీడీపీ నాయకులు మజ్జి సోమేశ్, కాకి పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 58వ వార్డు కోరమాండల్ గేటు వద్ద టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, శ్రీహరిపురం కూడలిలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. అలాగే నక్కవానిపాలెంలో నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గణబాబు పలువురు ఆటో డ్రైవర్లకు ఖాకీ దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెలే కూడా ఖాకీ చొక్కా ధరించారు.

సింధియా: గ్రేటర్ 40, 62, 63 వార్డుల్లోని పలు ప్రాంతాలతో పాటు యారాడలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. 62వ వార్డు త్రినాథపురంలో, 63వ వార్డు జైఆంధ్రా కాలనీలో జరిగిన కార్యక్రమాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు పేదలు, వృద్ధులకు చీరలు, పండ్లు, పంపిణీ చేశారు. కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా), టీడీపీ నాయకులు మజ్జి మాలినాయుడు, నీలాపు జోగి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతల అగ్రహారం బస్టాండ్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, పి.వెంకటరమణ, మద్దాల శ్రీనివాసరావులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషోత్తపురంలో మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, చీమలాపల్లిలో టీడీపీ నాయకుడు ఎ.ఎర్నిబాబు, పోర్లుపాలెంలో మాజీ ఉప సర్పంచ్ గల్లా వెంకటరమణ, లక్ష్మీపురంలో టీడీపీ నాయకుడు సీహెచ్ సాధూరావులు ఎన్టీఆర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటు సమీపంలో గల పైలాన్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పాత అగనంపూడిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాల వేసి అంజలి ఘటించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో గల రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కర్రి దోశేంద్ర, నెల్లి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో పెదమడకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కరణం పైడిరాజు, గల్లా రాజు, కె.జగదీశ్, ఎం.వెంకటరావు, గల్లా రుద్రకుమార్, జి.కనకభవానీ, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. అనంతరం పేదలకు దుస్తులు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు బొసెట్టి అప్పారావు, సుదర్శనరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదగంట్యాడలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. నాయకులు పి.సోమునాయుడు, అప్పారావు, పెంటయ్య పాల్గొన్నారు. దిబ్బపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకుడు కదిరి పోలరాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.



పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు కాలనీలో పేదలకు దుస్తులు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాంలో ఎన్టీ రామారావు విగ్రహానికి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు జాతికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని ఆయనన్నారు. నాయకులు నావన సింహచలం, వరహాలు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి పుష్పమాల వేసి అంజలి ఘటించారు. నాయకులు కరణం ముత్యాలనాయుడు, ఎస్.సాహు, బి.బాబూరావు, పీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు. హరిజన జగ్గయ్యపాలెం, పీలా నగర్ కాలనీల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు అలమండ రాజు, శీరం రాజేశ్, వి.జీవన్‌బాబు, ఎం.ఆనంద్, తదితరులు నివాళులర్పించారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధిలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమాల్లో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు బల్ల శ్రీనివాసరావు, మామిడి కిరణ్, ఆనంద్, జి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. 93వ వార్డులో టీడీపీ నాయకుడు గంగా వరహాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.



పీఎం మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పీవీఎన్ మాధవ్

ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కూర్మన్నపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ గాజువాక కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలో శనివారం మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేయడంతో పాటు టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పురోగతికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిలు ఎప్పటికప్పుడు స్టీల్‌ప్లాంట్ పరిస్థితులను మోదీకి, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామికి వివరించడం వల్లే ఈ ప్యాకేజీ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొండా ఎల్లాజీ, ఎల్.సోంబాబు, శశిధరన్ పిళ్లై, యువశ్రీ, విల్లా రామ్మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం

అగనంపూడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషితో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొక్కా రమేశ్, విందుల రాజు, కత్తి తిలక్, చినరాజు, చినవెంకరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తేనే మనుగడకు మేలు: మేయర్

ఎంవీపీ కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వల్ల మనుగడకు మేలు జరుగుతుందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం శివాజీ పార్కులో నిర్వహించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిశుభ్రత చాలా అవసరమన్నారు. ప్లాస్టిక్ వినియోగం సమాచానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం నిరోధానికి ఇళ్లు, కార్యాలయాల ఆవరణ, మిద్దెలపై మొక్కలు పెంచాలని కోరారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ నగరాన్ని తమ సొంత ఇంటిలా పౌరులు భావించాలన్నారు. ప్రతి వార్డులోనూ పరిశుభ్రత పోటీలు నిర్వహించి, అత్యంత స్వచ్ఛత గల వార్డులో రూ.5 లక్షలతో అదనపు పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ఏదైనా సాధ్యమని అన్నారు. శివాజీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు ఫొటోలు దిగారు. అదనపు కమిషనర్లు రమణమూర్తి, సోమన్నారాయణ, అధికారులు, కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జేడీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



శివాజీ పార్కులో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్. చిత్రంలో మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు

ఎంపీ శ్రీభరత్‌కు స్వాగతం పలికిన ఉక్కు కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ విమానాశ్రయంలో ఎంపీ శ్రీభరత్‌కు టీఎన్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ నాయకులు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంలో శ్రీభరత్ చేసిన కృషికి గాను కృతజ్ఞతలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కోగంటి లెనిన్‌బాబు, నమ్మి సింహాద్రి, విల్లా రామ్మోహన్‌కుమార్, గుమ్మడి నరేంద్రకుమార్, కొల్లి శివనాగేశ్వరరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, పెద్దాడ సోమినాయుడు, మండవ రఘుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



చీపుర్లతో రోడ్డును శుభ్రం చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పట్టణ, పల్లె ప్రాంతాల్లో స్వచ్ఛ దివస్

- కూటమి ప్రభుత్వం వల్లే ఇది సాధ్యం
- ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత కోసం పట్టణం, పల్లెలు అనే వ్యత్యాసం లేకుండా అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సంఘ నిధులు నేరుగా స్థానిక సంస్థ ఖాతాకే జమ చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. 97వ వార్డు పరిధి చినముషిడివాడ, సత్యానగర్‌లో శనివారం స్వచ్ఛ దివస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు చీపుర్లు పట్టుకుని రహదారిని శుభ్రం చేశారు. చెట్ల కొమ్మలకు ట్రీ కటింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీతో ఊపిరి అందినట్టయిందని ఆయన పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలవగలదని, ఇది మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, జెడ్సీ హేమావతి, కూటమి నాయకులు సేనాపతి సోమశేఖర్, అవగడ్డ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట (కంచరపాలెం): స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రాగా రాష్ట్రాన్ని మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 56 వార్డు పరిధి పైడిమాంబ కాలనీలో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలోని చెత్తాచెదారాలను చీపుర్లతో ఊడ్చి తొలగించారు. స్థానికులు, నాయకులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్సీ రాము, ఏఎంహెచ్‌వో సునీల్, టీడీపీ నాయకులు వై.కనకేశ్వర్రావు, మళ్ల శంకర్రావు, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణబాబుతో కలిసి రోడ్డును శుభ్రం చేస్తున్న పలువురు అధికారులు

మల్కాపురం: స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా 58వ వార్డులోని పలు ప్రాంతాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, తదితరులు పరిశుభ్రం చేశారు. ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయనన్నారు. మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు పి.శ్రీనివాసరావు, రాజేశ్ మనోజ్, రాంబాబు, మేస్త్రి పైడితల్లి తదితరులు పాల్గొన్నారు. 59వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

గోపాలపట్నం: స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఇక్కడి రైతు బజారులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బజారులోని రైతులు, వర్తకులు ప్రాంగణంలోని చెత్తాచెదారం, తుప్పలను తొలగించారు. అనంతరం బజార్ ఎస్టేట్ అధికారి ప్రసాద్ రైతులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు.

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం సమీపం హౌసింగ్ బోర్డు కాలనీలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. కార్మికులతో పాటు ఆయన చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. బీజేపీ నాయకులు చిక్కాల సతీశ్, బి.గురునాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్/కూర్మన్నపాలెం: ఐలా కార్యాయలంలో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని కమిషనర్ ఎ.కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న పరిశుభ్రమైన దేశం కోసం అందరం అహర్నిశలు కృషి చేద్దామంటూ ఏపీఐఐసీ ఐలా, వాసీవా, ఎంఎస్ఎంఈ, పారిశ్రామికవేత్తలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వీధులను శుభ్రం చేయడంతో పాటు కాలుష్య నివారణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి పి.పద్మావతి, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు సజ్జ పాండురంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కణితి పీహెచ్‌సీలో చేపట్టిన కార్యక్రమంలో వైద్యులు శివయ్య, స్వరూపారాణి, ప్రత్యేక ఆరోగ్య విస్తరణాధికారి బాబీ, తదితరులు పాల్గొన్నారు. కాగా 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కుల్లో స్వచ్ఛ దివస్‌ను చేపట్టారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: బాజీ జంక్షన్‌లోని పంచతత్వ పార్కులో కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆధ్వర్యంలో పలువురు అధికారులు, స్థానికులు చెత్తాచెదారాలను తొలగించారు. తొలుత పరిసరాల పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఏఈ వెంకటలక్ష్మి, పార్క్ కమిటీ అధ్యక్షుడు పి.శ్రీధర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కోసం పవన్‌కల్యాణ్ చేసిన కృషి ప్రశంసనీయం

జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు

ఉక్కుటౌన్ షిప్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన కృషి విశేషనీయమని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ఉక్కు కర్మాగారానికి కేంద్రం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన నేపథ్యంలో ప్లాంటులో శనివారం ఉక్కు ఉద్యమ నేత దివంగత అమృతరావు విగ్రహానికి, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రంపై జనసేనాని ఒత్తిడి తెచ్చి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారన్నారు. స్టీల్‌ప్లాంటుకు అన్ని విధాల సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఆర్థిక ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గడసాల అప్పారావు, దల్లి గోవిందరెడ్డి, సోమశేఖర్, ప్రియదర్శిని, గంధం వెంకటరావు, సోమన్న, చినఅప్పారావు, ఎం.విజయ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



అమృతరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న కోన తాతారావు

ముగిసిన వింద్ బాల్ క్రికెట్‌పోటీలు

మల్కాపురం జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు శ్రీనివాసనగర్‌లో సాయిచరణ్ జ్ఞాపకార్థం నిర్వహించిన వింద్‌బాల్ క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విన్నర్స్‌గా పెదగంట్యాడ జట్టు, రన్నర్స్‌గా శ్రీనివాసనగర్ జట్టు నిలిచింది. విజేతలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో సత్తా చూపుతున్నారు

ఉద్యోగం/వ్యాపారం చేసుకుంటూనే సామాజిక మాధ్యమాల్లో రాణించే యత్నం

- నగరానికి చెందిన పలువురికి లక్షల్లో ఫాలోవర్స్/సబ్‌స్క్రైబర్స్
- ఆదాయం రావడంతో పాటు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు అవకాశం లభిస్తుండడమే కారణం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి చెందిన మత్స్యకార యువకుడు నాని కొన్నాళ్ల కిందట సరదాగా యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాడు. సముద్రంలో వేటకు వెళ్లినప్పటి నుంచి వచ్చేంత వరకూ ఏం చేస్తారో వీడియోలు తీసి యూట్యూబ్‌లో పెట్టడం ప్రారంభించాడు. సముద్రంలో వేట, ప్రయాణం వంటివి వీక్షకులకు నచ్చడంతో సబ్‌స్క్రైబర్స్ భారీగా పెరిగారు. అతను ఇప్పటివరకూ 663 వీడియోలను అప్‌లోడ్ చేయగా, ప్రస్తుతం 2.23 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నల్లా శరత్, నిషా దంపతులు ఈ మధ్యకాలంలోనే ఇన్‌స్టా రీల్స్ చేయడం ప్రారంభించారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య సరదాగా జరిగే సంభాషణలను ఇతివృత్తంగా తీసుకుంటూ వీక్షకుల మనసులను దోచుకుంటున్నారు. ఇప్పటివరకూ శరత్, నిషా దంపతులు 135 వీడియోలను అప్‌లోడ్ చేయగా, 1.53 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి వీడియోకు వేలల్లో వ్యూస్ వస్తున్నాయి.



నల్లా శరత్, నిషా దంపతులు

'అమ్మ చేతి వంట పేరుతో 2017లో భార్గవి అనే ఆమె యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించారు. ప్రతిరోజూ భిన్నమైన వంటలను చేస్తూ వీడియోలను అప్‌లోడ్ చేస్తారు. ఈ వీడియోలకు భారీగా వ్యూస్ వస్తున్నాయి. ఇప్పటివరకూ అమ్మ చేతి వంట యూట్యూబ్ ఛానెల్‌లో 1,500 వీడియోలు అప్‌లోడ్ చేయగా, 3.49 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఒక్కో వీడియోకు లక్షల్లో వ్యూస్ చేస్తుంటాయి. ఇన్‌స్టాలోనూ ఆమె అకౌంట్‌ను 2.05 లక్షల మంది ఫాలో అవుతున్నారు.



అమ్మచేతి వంట... భార్గవి

నగరానికి చెందిన గుడ్ల ధరణి ఇదే పేరుతో ఇన్‌స్టా అకౌంట్‌ను రన్ చేస్తున్నారు. ఈ అకౌంట్‌లో మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే డ్రెస్‌లు, చీరల గురించి చెప్పడంతోపాటు మహిళలకు సంబంధించిన ఇతర వస్తువుల గురించి తెలియజేస్తుంటారు. కొత్త సినిమా పాటలకు డ్యాన్స్ కూడా చేస్తుంటారు. ఇప్పటివరకూ ఆమె 1,670 వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయగా, 4.05 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి వీడియోకు వేలల్లో వ్యూస్ వస్తున్నాయి.



ధరణి గుడ్ల



లోకల్ బాయ్ నాని

సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఇతర ప్లాట్‌ఫామ్స్‌పై సత్తా చాటుతున్న నగరవాసుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి వీడియోకు లక్షల్లో వ్యూస్ వచ్చే యూట్యూబర్స్/ఇన్‌స్టా క్రియేటర్స్ ఎంతోమంది ఉన్నారు. వ్యూస్‌ను బట్టి ఆదాయం కూడా వస్తుండడంతో రోజులో కొంత సమయాన్ని వాటికి కేటాయిస్తున్నారు. ఆదాయంతో పాటు తమను తాము నిరూపించుకునేందుకు సామాజిక మాధ్యమాన్ని ఎంచుకుంటున్నట్టు పలువురు చెబుతున్నారు.

ఇలాంటి వారిలో విభిన్న రంగాలు, వయసులు, వృత్తులవారు ఉంటున్నారు. బలమైన కోర్కె, అందుకు అనుగుణమైన నాలెడ్జ్, కొంత శ్రమించే గుణం ఉంటే చాలు...ఎవరైనా ఇందులో రాణించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఇవి ఉంటే చాలు..

యూట్యూబర్, ఇన్‌స్టా క్రియేటర్‌గా రాణించాలంటే కొన్ని వస్తువులు ఉంటే సరిపోతుంది. మంచి క్వాలిటీతో వీడియోలు తీసేందుకు అనుగుణమైన ఫోన్/ కెమెరా ఉండాలి. మరొకరి సహాయంతోగానీ ఒక్కరేగానీ వీడియోలు తీసుకోవచ్చు. ఇందుకోసం స్టాండ్‌తోపాటు మరికొన్ని వస్తువులు ఉం డాలి. అలాగే వీడియో ఎడిటింగ్, స్పెషల్ ఎఫెక్ట్స్ ఇచ్చే నాలెడ్జ్ ఉండాలి. ఒక్కరే వీడియోలను తీసి అప్‌లోడ్ చేసుకోవచ్చు.

భారీగానే ఆదాయం

సామాజిక మాధ్యమాల్లో అకౌంట్ ఓపెన్ చేసిన తరువాత అప్‌లోడ్ చేసే ప్రతి వీడియోకు భారీగా వ్యూస్ రావు. ఇందుకోసం చాలా శ్రమించాల్సి ఉంటుంది. వీక్షకులు అభిరుచులకు అనుగుణంగా కంటెంట్‌తో కూడిన వీడియోలు చేస్తేనే వ్యూస్ వస్తాయి. యూట్యూబ్ మాత్రమే వీడియోలకు వచ్చిన వ్యూస్, చూసిన నిడివి వంటి అంశాలను పరిశీలించి కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్/యూట్యూ బ్‌లలో ఫాలోవర్స్ పెరిగితే స్థానికంగా వ్యాపార సంస్థలు, ఉత్పత్తులను ప్రమోట్ చేయడం ద్వారా ఆదాయం సంపా దించవచ్చు. కనీసం లక్ష మంది సబ్‌స్క్రైబర్లు/ ఫాలోవర్లు ఉన్న వారికి స్థానికంగా మంచి డిమాండ్ ఉంటోంది. వారి వీడియోల్లో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేయించుకునేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు.

టాలెంట్ హంట్..

సామాజిక మాధ్యమాల వల్ల ఎంతోమందికి మేలు కలుగుతోంది. అదనపు ఆదాయాన్ని సంపాదించుకునే అవ కాశం లభించడంతో పాటు తమలోని ప్రతిభను బయట ప్రపంచానికి తెలియజేసేందుకు ఉపయోగపడుతున్నాయి. అయితే కొన్ని రకాల ఇబ్బందులు కూడా ఉన్నట్టు యూ ట్యూబర్స్ చెబుతుంటారు. ఫాలోవర్స్‌ను సంపాదించడం ప్రస్తుతం కష్టంగా మారుతోంది. ఇందుకోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఆదరణ లేకపోయినా, నెగెటివ్ కామెంట్లు వచ్చినా కొంతమంది డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు. అలాంటి వాటి విషయంతో తగిన జాగ్రత్తలతో ముందుకువెళ్లాల్సి ఉంటుంది.

నెలకు 25 వీడియోలు అప్‌లోడ్

- పెట్ల కిరణ్‌కుమార్, ఫుడ్ లవర్స్ గ్యాంగ్ యూట్యూబ్ చానెల్

అప్పట్లో హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే ఫుడ్ ఛానెల్స్ ఉండేవి. ఏపీలో రుచులను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో 2019లో ఛానెల్ ప్రారంభించాను. 'ఫుడ్ లవర్స్ గ్యాంగ్' అనే పేరు పెట్టాను. ఇప్పటివరకూ 1500 వీడియోలు అప్‌లోడ్ చేశాను. ప్రస్తుతం యూట్యూబ్‌లో 4.34 లక్షల వరకు సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇన్‌స్టాలో మూడు లక్షల వరకు ఫాలోవర్స్ ఉన్నారు. ఐదు రాష్ట్రాల్లో భిన్నమైన ఆహార పదార్థాలను వీక్షకుల దృష్టికి తెచ్చాను. నెలకు కనీసం 25 వీడియోలు అప్‌లోడ్ చేస్తాను. ఒక్కో వీడియోకు కనీసం ఆరు గంటలు శ్రమిస్తాను. షూటింగ్‌కు నాలుగు గంటలు, ఎడిటింగ్‌కు రెండు గంటలు పడుతుంది.



పెట్ల కిరణ్‌కుమార్

టీడీపీ కార్యాలయంలో రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీభరత్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాతలకు ఎంపీ శ్రీభరత్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌తో పాటు నాయకులు వెల్లంకి భరత్, అనసూరి మధు, తోట రత్నం, కొయిలాడ వెంకట్, దాసన సత్యనారాయణ, బర్ల బాలకృష్ణ, పద్మ, సీఎం రమణ, ఎ.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో అవినీతి నియంత్రణే లక్ష్యం

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ కింజరాపు ప్రభాకర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అవినీతికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్ అన్నారు. అదనపు ఎస్పీ స్థాయిలో ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శనివారం ఆయన ఎంవీపీకాలనీలోని వీఎంఆర్డీఏ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అవినీతి జరిగినా, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినా, ప్రభుత్వ ధనాన్ని వృథా చేసినా, ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయకపోయినా సమగ్ర విచారణ జరిపి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను గోప్యంగా ఉంచి, వాటి ఆధారంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతి, అక్రమాలపై రహస్యంగా విచారణ జరిపి చర్యలకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

వీఎంఆర్‌డీఏ సెక్రటరీగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సెక్రటరీగా పి.మురళీకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మన్యం జిల్లా పార్వతీపురం తోటపల్లి బ్యారేజీ యూనిట్-3 డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను వీఎంఆర్‌డీఏకి బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జాయింట్ కమిషనర్ రమేశ్ పూర్తి బాధ్యతలను మురళీకృష్ణకు శనివారం అప్పగించారు. ఎస్టేట్ అధికారిగా నియమితులైన దయానిధి కూడా రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు



దర్శకుడు వైవీఎస్ చౌదరికి ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షణాధికారి

సింహాచలం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి దంపతులు శనివారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్.ఆనందకుమార్ అధికార లాంచనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి

అలాగే.. వరాహ లక్ష్మీనృసింహస్వామిని టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత, దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పర్యవేక్షణాధికారి పి.పద్మనాభరాజు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

స్వచ్ఛత నిరంతర కార్యక్రమం



సిటీ సెంట్రల్ పార్కును శుభ్రం చేస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

డాబాగార్డెన్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. శనివారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్, స్వచ్ఛ విశాఖ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్కులోని ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం కొనసాగే ప్రక్రియ ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తే మనం బంగారు భవిష్యత్‌ను అందించినట్టేనన్నారు. ప్లాస్టిక్‌ను సేకరించి రీసైకిల్ చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ ప్లానింగ్ అధికారి శిల్పా, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇంజనీర్ బలరామరాజు, హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి శివానీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌లో విశాఖ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అంతర్ జిల్లా బాలుర అండర్-12 నాకౌట్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య విశాఖ ఫైనల్స్‌కు చేరింది. నగరంలోని వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో శనివారం జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో విశాఖ తొమ్మిది వికెట్ల తేడాతో కడపపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 35 ఓవర్లలో నాలుగు వికెట్లకు 194 పరుగులు చేసింది. ఓపెనర్ మహ్మద్ తాహీర్ సెంచరీ (90) చేజారగా, మిడిల్ ఆర్డర్ టి.వేణు అర్ధ సెంచరీతో (68) రాణించాడు. విశాఖ బౌలర్ బి.రోహిత్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన విశాఖ 32.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 195 పరుగులతో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ పూజిత్ చరణ్ (22) తొలి వికెట్‌గా అవుటవగా, మరో ఓపెనర్ పి.యశిల్ విఘ్నేష్ (66), వన్‌డౌన్ బ్యాటర్ కె.సాయి దీపక్ శ్రీనివాస్ (76) అజేయ అర్ధ సెంచరీలు సాధించి జట్టుకు సునాయాస విజయాన్నందించి ఫైనల్స్‌కు చేర్చారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు చేతులు కలుపుదాం: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధన దిశగా అడుగులు వేద్దామని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కృష్ణమం దిరం జంక్షన్‌లో ఉద్యోగులు మానవహారంగా ఏర్ప డ్డారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛాంధ్ర సాధనకు సంబంధించి నినాదాలు చేశారు. చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను జాగ్రత్తగా ఉంచుకుంటేనే స్వచ్ఛాంధ్ర సాధ్యపడుతుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏయూ అసెంబ్లీ హాలులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి, ఏఎన్నార్ శత జయంతి కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినీ నటుడు బ్రహ్మానందం, నిర్మాత అశ్వనీదత్ తదితరులు









డీఆర్‌కే ప్రసాద్, స్వర్ణభారతి ట్రస్ట్ చైర్మన్ దీపా వెంకట్, పోలిచర్ల హరినాథ్‌లను సత్కరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సినీ నటుడు బ్రహ్మానందం. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

బ్లూఫ్లాగ్ బీచ్‌లో ప్లాస్టిక్ నిషేధం

సాగర్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలతో జీవన శైలి విచ్ఛిన్నమవుతుందని జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి అన్నారు. రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్‌ను ప్లాస్టిక్ రహిత జోన్‌గా కలెక్టర్, బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రకటించిన నేపథ్యంలో శనివారం బీచ్‌లో నిర్వహించిన ప్లాస్టిక్ రహిత-పర్యావరణహిత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎకో టూరిజం నేపథ్యంలో బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ సంచులు, ప్లేట్లు, స్పూన్లు వాడితే రూ.50 అపరాధ రుసుము విధిస్తామన్నారు. మత్స్యశాఖ సంచాలకుడు భామిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో వేయడం వల్ల సముద్ర జీవరాశులు నశిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా బీచ్‌లో అధికారులు మొక్కలు నాటారు. ఏపీటీడీసీ జిల్లా మేనేజర్ జగదీష్, అటవీ శాఖ సబ్ డీఎఫ్‌ఓ శివాని, జీవీఎంసీ స్వచ్ఛత ప్రమోటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో జాబ్ మేళాలు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 20న కంచరపాలెంలోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో, 21న పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాలు జరుగుతాయ న్నారు. 20న జరిగే జాబ్ మేళాలో బీ-డేటా టెక్నాలజీస్, భారత్ ఫైనాన్సి యల్ ఇంక్లూషన్ లిమిటెడ్ (ఇండస్ ఇండ్ బ్యాంక్), నవతా రోడ్ ట్రాన్స్ పోర్ట్, పేటీఎం కంపెనీలు పాల్గొం టాయని, పదో తరగతి పాస్, ఫెయి ల్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 8555868681 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే 21న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్ మేళాకు టాప్ డిజిటల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (అమెరికా కంపెనీ), కేఎల్ గ్రూప్, టీమ్ లీజ్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ కాకుండా) విద్యార్హత సాధించిన వారు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7702506614 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్‌ఎల్‌ఆర్‌బీ) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శనివారం కొనసాగాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలలో 336 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.బాలసూర్యారావు, ఎల్.మన్మథరావు, బి.రామకృష్ణారావు, టి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

భారత్ రాజ్యాంగమే అత్యున్నతం: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

జగదాంబ కూడలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లోనే భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డి అభివర్ణించారు. శనివారం నగరంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ (రాజ్యాంగ సమ్మాన్)లో ఆయన ప్రసంగిస్తూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు కావడం ముదావహమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎన్నో గొప్ప అంశాలను రాజ్యాంగంలో పొందుపర్చారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సమాజంలో ఎలా వ్యవహరించాలో రాజ్యాంగం స్పష్టంగా తెలిపిందన్నారు. సభాధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.మాధవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కాశీ విశ్వనాథరాజు, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం